ఒక ఛైర్మన్.. ఐదుగురు సభ్యులు

ఉమ్మడి జిల్లాకు నామినేటెడ్ పోస్టులు



ఈనాడు డిజిటల్, అనంతపురం: ఉమ్మడి జిల్లాకు చెందిన తెదేపా నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. మంగళవారం వివిధ శాఖల కార్పొరేషన్లు, బోర్డులు, కౌన్సిళ్లు, సొసైటీలకు సంబంధించి ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీపక్‌రెడ్డిని సీడప్ (ఉద్యోగ కల్పన, వ్యాపారాభివృద్ధి సొసైటీ) ఛైర్మన్‌గా.. ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురుని వివిధ కార్పొరేషన్ల సభ్యులుగా నియమించారు. నెల్లూరు జిల్లాకు చెందిన **దీపక్‌రెడ్డి** వ్యాపార నిమిత్తం అనంతపురం జిల్లా రాయదుర్గానికి వచ్చారు. ఇక్కడే తెదేపాలో కొనసాగుతూ పార్టీ కోసం పనిచేశారు. ఈయన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అల్లుడు. 2012 ఉప ఎన్నికల్లో తెదేపా ఆయన్ను రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టింది. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో టికెట్ ఆశించినా దక్కలేదు. 2017లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలపడంతో ఎన్నికయ్యారు. అప్పటి నుంచి పార్టీలో కీలకంగా ఉంటూ వస్తున్నారు. గత ఎన్నికల్లోనూ రాయదుర్గం టికెట్ ఆశించారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు కన్వీనర్‌గా వ్యవహరించారు.

సభ్యులు వీరే..

రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ సభ్యుడిగా రాయదుర్గానికి చెందిన పి.పురుషోత్తం నియమితులయ్యారు. 2014-19 మధ్యలో రాయదుర్గం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. బత్తలపల్లికి చెందిన గోనుగుంట్ల విజయ్‌కుమార్‌ను పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా కొనసాగనున్నారు. విజయ్‌కుమార్ తల్లి జయమ్మ, తండ్రి అనంతరెడ్డి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. ధర్మవరానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్యను రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. కాటమయ్య తెదేపా ఆవిర్భావం నుంచి పని చేస్తున్నారు. అమడగూరుకు చెందిన బుక్య కాలేనాయక్‌ను పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ సభ్యుడిగా కొనసాగనున్నారు. గుంతకల్లుకు చెందిన జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ కుమారుడు కేసీ హరికుమార్‌ను మార్క్‌ఫెడ్ సభ్యుడిగా నియమించారు.



తుప్పపట్టి పనికి రాకుండాపోయిన మినీ జేసీబీ

స్వచ్ఛతకు పాతర

రూ.3 కోట్లు విలువైన యంత్రాలకు తుప్పు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పురపాలికలో స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ లక్ష్యానికి పాతరేశారు. పట్టణంలో నిత్యం పోగయ్యే చెత్తను ఎప్పటికప్పుడు పోగు చేసి డంపింగ్‌యార్డులకు చేర్చాలి. ఆదిశగా పురపాలికను స్వచ్ఛంగా ఉంచడానికి రూ.3 కోట్లు ఖర్చు చేసి తెచ్చిన రెండు స్వీపింగ్ యంత్రాలు, మినీ జేసీబీ, మూడు పొక్లెయిన్లు, ఇతరత్రా వాహనాలు మూలకు చేరాయి. వీటిని నడపడానికి అవసరమైన చోదకులను నియమించకపోవడంతో ఒక్కసారి కూడా వినియోగించకుండానే పనికి రాకుండాపోయాయి. దీనిపై పురపాలక ఛైర్‌పర్సన్ భవానీ స్పందిస్తూ యంత్రాలను వినియోగంలోకి తేవడానికి కౌన్సిల్‌లో అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.




ఆరుబయట పొక్లెయిన్ విడిభాగాలు

రథం దహనం ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో రామాలయ రథం దహనమైన ఘటనపై సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సోమవారం అర్ధరాత్రి రథం ఉంచిన షెడ్డు తాళాలను ధ్వంసం చేసి, రథానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. కారకులను గుర్తించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన నాలుగు బృందాలు వేగంగా నిందితులను గుర్తించాలన్నారు. ఈ ఘటనను ఆసరాగా తీసుకుని దుష్ప్రచారాలను చేసే శక్తులు, వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, ఎలాంటి ఉద్రిక్తతలకు లోనుకాకుండా ప్రజలు సంయమనం పాటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ కోరారు.

కార్యాలయాల చుట్టూ తిరిగి.. ఊపిరి తీసుకుని



గార్లదిన్నె, పామిడి, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన భూ రీసర్వేలో ఏళ్లుగా సాగులో ఉన్న పొలం మిగులు భూమిగా గుర్తించడం.. భూమికి పాసుపుస్తం ఇచ్చి న్యాయం చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగి.. విసిగిపోయి చివరకు రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఊపిరొదిలారు. పామిడిలోని బొడ్రాయి వీధిలో నివాసం ఉంటున్న సూర్యనారాయణ (55) గార్లదిన్నె మండలం బూదేడు పంచాయతీలో సాగులో ఉన్న భూమికి పట్టా కోసం రెండేళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో సోమవారం అనంత కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కర వేదిక'లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లి, అక్కడే పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, మంగళవారం ఉదయం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సర్వే నంబరు 135/1లోని 1.54 ఎకరాలకు పాసుపుస్తకం ఇవ్వడానికి బూదేడు వీఆర్వో మధు రూ.13 వేలు డిమాండ్ చేశారని మృతుడి భార్య ఈశ్వరమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. గార్లదిన్నె తహసీల్దార్ ఈరమ్మను వివరణ కోరగా వైకాపా ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో మిగులు భూమిగా గుర్తించారు. సాగు చేస్తున్న భూమికి ఆధారాలు చూపిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు.

ఆగస్టు 19న బొమ్మనహాళ్ మండలం తారాకపురానికి చెందిన గడ్డం సుంకన్న అనే వృద్ధుడు తన భూమిని కబ్జా చేశారని.. సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేదు. విధిలేక అక్కడి మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. సకాలంలో పోలీసులు కాపాడి బళ్లారి ఆస్పత్రికి తరలించారు.

ప్రాణాలతో రెవెన్యూ చెలగాటం!

- అర్జీల పరిష్కారంపై అలసత్వం
- సమస్య పరిష్కరించకనే ముగింపు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే


ఎన్నో కష్టాలతో 'రెవెన్యూ' కార్యాలయాలకు చేరే బాధితులకు స్వాంతన చేకూరడం లేదు. అర్జీలు ఇచ్చామన్న మాటే గాని.. పరిష్కారం చూపడం లేదు. ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందన్న కారణంతో పరిష్కరించని అర్జీలకు ముగింపు పలుకుతున్నారు. గతంలో 75 శాతం అర్జీదారుల్లో అసంతృప్తి ఉన్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా తేటతెల్లమైంది. బాధిత ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించే నాథుడే కరవయ్యాడు. బాధితులతో కనీసం ఐదు నిమిషాలు మాట్లాడినా సమస్య తీర్చే అవకాశం లభిస్తుంది. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోనే కాదు... డివిజన్, మండల తహసీల్దారు, మున్సిపల్ కార్యాలయాల్లో అర్జీలు తీసుకుని పంపిస్తున్నారు. నిర్దేశిత గడువు తీరే సమయంలో హడావుడిగా పరిష్కారించాం..అంటూ ఆన్‌లైన్‌లో ముగించేస్తున్నారు. ఇదొక తంతుగా కొనసాగుతోంది. బాధితుడు సంతృప్తి వ్యక్తం చేస్తేనే.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వెబ్‌సైట్‌లో ముగించాలి. ఇలా అధికారులు అమలు చేయకపోవడంతో బాధితుల్లో తీరని వ్యథ మిగులుతోంది.

పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తాం

- శివనారాయణ శర్మ, జేసీ

గార్లదిన్నె భూ సమస్యపై విచారణ చేస్తున్నాం. రైతు సూర్యనారాయణ మృతి నేపథ్యంలో మండల అధికారులను పిలిపించి విచారిస్తున్నాం. తప్పు ఉందా లేదా అని తేలుస్తాం. జిల్లా అంతటా భూసమస్యల పరిష్కారంపై మరింత శ్రద్ధ పెడతాం.

ప్రధాన శాఖలకు వచ్చిన అర్జీలు, పెండింగ్ ఉన్నవి ఇలా..



ఇష్టారాజ్యంగా..

రెవెన్యూ శాఖ ఎంతో కీలకం. తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్ఓ.. ఇలా ఎవరు ఎప్పుడు కార్యాలయాలకు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో అంతుచిక్కని పరిస్థితి. పని భారం సాకుతో విధులను సరిగ్గా నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దయనీయం ఏమంటే... తహసీల్దారు కార్యాలయంలోనే ఇవ్వాల్సిన భూమి 'అడంగల్' కోసం శెట్టూరు నుంచి ఓ బాధితుడు కలెక్టరేట్‌కు రావడం విశేషం. నేరుగా కలెక్టర్‌ను కలిసి విన్నవించడంతో వెలుగులోకి వచ్చింది. ఇదే తరహాలోనే కుల, ఆదాయ పత్రాలు ఇవ్వలేదంటూ పుట్లూరు నుంచి మూడు వారాల క్రితం ఓ మహిళ తన బిడ్డను వెంటపెట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. అప్పటికపుడు కలెక్టర్ ఆయా మండలాల తహసీల్దార్లతో మాట్లాడాల్సి వచ్చింది. చిన్న చిన్న సమస్యలను కూడా తీర్చకుండా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా.. సూర్యనారాయణ మృతి, గడ్డం సుంకన్న ఆత్మహత్యాయత్నం.. వంటి ఘటనలు రెవెన్యూ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వంద రోజుల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు

మొత్తం	పరిష్కారమైనవి	పెండింగ్
4,123	3,398	736

భూ సమస్యలే అధికం..

గత వైకాపా పాలనలో భూఆక్రమణలు, దౌర్జన్యాలు.. పట్టాల మార్పిడి.. వంటి బాగోతాలు కుప్పలు తెప్పలుగా తెరపైకి వచ్చాయి. వాటి పరిష్కారంపై గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే బాధితులు తమ గోడు వినిపించుకోడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సోమవారం 400 నుంచి 500 దాకా అర్జీలు దాఖలు కావడం విశేషం. ఇందులో 60-70 శాతం కేవలం రెవెన్యూ శాఖకు చెందినవే ఉంటున్నాయి. కబ్జాలు, పట్టాలు.. వంటి వాటిపై అర్జీలు వస్తున్నాయి.



గత సోమవారం అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వైకాపా మాజీ ప్రజాప్రతినిధి సోదరుడి కబ్జాపర్వం



ఈనాడు డిజిటల్, అనంతపురం

గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు రెచ్చిపోయారు. భూమి ఖాళీగా కనబడితే చాలు కబ్జా చేసేశారు. భూయజమానులను బెదిరించి విలువైన ప్రైవేటు స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల్ని గుప్పిట్లో పెట్టుకుని సాగించిన భూఅక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. రాప్తాడు వైకాపా ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకుడి సోదరుడు దౌర్జన్యంగా ఓ విశ్రాంత ఉద్యోగికి చెందిన భూమిని ఆక్రమించిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. కబ్జా చేయడమే కాకుండా.. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి ఇతరులకు విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ ప్రస్తుతం రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. తెదేపా కూటమి ప్రభుత్వం గతంలో జరిగిన భూఅక్రమాలపై ఫిర్యాదులు స్వీకరించి విచారణ జరుపుతోంది. దీంతో బాధితుడు సోమవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో..

రాప్తాడు పొలం పరిధి 4-4, 5-3, 6-2 సర్వే నంబర్లలోని 2 ఎకరాల భూమిని అనంతపురం నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పి.లక్ష్మణ్ణ, గుత్తికి చెందిన యజమాని నుంచి 1985లో కొనుగోలు చేశారు. 2001 నుంచి 2010 వరకు 3 సెంట్ల చొప్పున 8 ప్లాట్లు విక్రయించారు. మిగిలిన 1.76 ఎకరాలు అలాగే ఉంది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న సదరు స్థలంపై స్థానిక నాయకుల కన్ను పడింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ద్వారా పావులు కదిపారు. లక్ష్మణ్ణను ప్రజాప్రతినిధి వద్దకు పిలిచి సగం భూమి ఇవ్వాలని బెదిరించారు. అంగీకరించకపోవడంతో పాత యజమాని వారసుల నుంచి భూమి అక్రమంగా రాయించుకున్నారు. సదరు భూమి హక్కుదారు లక్ష్మణ్ణ అయినప్పటికీ సంబంధం లేని వ్యక్తుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్లాట్లు వేసి కొన్నింటిని ఇతరులకు విక్రయించారు. తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు అప్పట్లోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతేడాది ఏప్రిల్‌లో కోర్టు ఇంజెక్షన్ ఉత్తుర్వులు జారీ చేసింది. సదరు భూమిలో ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయవద్దని అధికారుల్ని ఆదేశించింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ఒత్తిళ్లతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లను కొనసాగించడం గమనార్హం. దీంతో బాధితుడు కోర్టు దిక్కార పిటిషన్ దాఖలు చేశారు.

పట్టు రైతులూ.. 'ఈనాడు' మీతోడుగా..

బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహక బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమ శాఖ జేడీ (జాయింట్ డైరెక్టర్) దుగ్గిరాల పద్మావతితో ఫోన్‌లో సంప్రదించే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. పట్టు రైతులు కింది ఫోన్ నంబర్లలో సంప్రదించి.. జేడీ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఎప్పుడు: ఈనెల 26వ తేదీ (గురువారం)
సమయం: ఉదయం 11గంటల నుంచి 12 గంటలలోపు
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 98666 99198, 80085 73039



విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతున్న మంత్రి సవిత

గుర్తుకొస్తున్నాయ్..

సైకిల్ తొక్కిన రాష్ట మంత్రి సవిత

దశాబ్దాల కిందట సైకిల్ తొక్కిన రోజులు గుర్తుకొస్తున్నాయంటూ విద్యార్థులతో కలిసి బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత సైకిల్ తొక్కారు. మంగళవారం గోరంట్ల మండలంలోని మల్లాపల్లిలో చదువుతున్న పేద విద్యార్థులు గ్రామాల నుంచి సమయానికి పాఠశాలకు చేరుకోవడానికి ఆ పంచాయతీకి చెందిన తెదేపా నాయకులు సొంతనిధులతో సైకిళ్లను ఏర్పాటుచేశారు. వాటిని మంత్రి పంపిణీ చేశారు. దాతలు మహమ్మద్, వెంకటరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణస్వామి, పాఠశాల కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను అభినందించారు.

- న్యూస్‌టుడే, గోరంట్ల

సామాజిక స్పృహపై అవగాహన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక స్పృహపై అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శారద ప్రసంగిస్తూ విద్యార్థి దశ నుంచే సేవా దృక్పదాన్ని అలవరచుకోవాలన్నారు. వాలంటీర్లుగా చేరిన విద్యార్థుల్లో ఎన్ఎస్ఎస్ ద్వారా సామూహిక అనుభవం లభిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లను సన్మానించారు.

ప్రసాదం అపవిత్రంపై పురంలో నిరసన

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: కోట్లాది మంది ప్రజలు ఆరాధించే కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం హిందూపురంలో తెదేపా, జనసేన, భాజపా, హిందూఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వీరు తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ఈ సంఘటనకు పాల్పడిన వారిపై తగిన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గోవధ నిషేధించాలని, వక్ఫ్‌బోర్డు తరహా హిందూదేవాలయాల ఆస్తుల పరిరక్షణకు ఒక చట్టం తీసుకురావాలని సీనియర్ సహాయకుడు గురుమూర్తికి వినతిపత్రం అందజేశారు.



అంబేడ్కర్ కూడలిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న కూటమి, హిందూ ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు

అనంత స్టేషన్‌కు నూతన శోభ

- అందుబాటులోకి భవనం..
- రెండు నెలల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు సిద్ధం



విశాలమైన ఫుట్ ఓవర్ వంతెన

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: అనంత రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ వచ్చింది. ఒకటో రోడ్డు వైపు నూతన ప్లాట్‌ఫాం1లో సువిశాల భవనం ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఇందులో స్టేషన్ మేనేజర్, ఉపస్టేషన్ మేనేజర్ల గదులతో పాటు రెండు వేచి ఉండు గదులు ఏర్పాటు చేశారు. ఉన్నత శ్రేణి ప్రయాణికుల కోసం శీతల గది ఏర్పాటు చేశారు. విశాలమైన ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.9 కోట్లతో శ్రీనివాస నగర్ వైపు పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో సగ భాగం పనులు ప్రస్తుతం మొదలయ్యాయి. సగభాగం నిర్మాణం పూర్తి అయిన తర్వాత మిగతా సగభాగం నిర్మాణం చేపడతారు. ఈ భవనం కూడా అందుబాటులోకి వస్తే అనంతపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలకు ఊరట దక్కుతుంది. గత 50 ఏళ్లుగా రెండు ప్లాట్‌ఫాంలకే పరిమితమైన ఈ స్టేషన్‌లో ప్రస్తుతం నాలుగు ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి వచ్చాయి.

❒ రైల్వేస్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫారాలకు లిఫ్టుల నిర్మాణం చేపట్టారు. రెండు నెలల్లో లిఫ్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మూడుచోట్ల లిఫ్టులు అందుబాటులోకి రానున్నాయి. 4 ప్లాట్‌ఫారాలపై దిగిన ప్రయాణికులు లిఫ్టుల సహాయంతో ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారంపైకి మారడానికి వీలవుతుంది. అనంతపురం రైల్వేస్టేషన్ ఏ కేటగిరీ జాబితాలో ఉండటంతో ఎస్కలేటర్లు కూడా మంజూరు అయ్యాయి.

❒ అనంతపురం స్టేషన్ మీదుగా రోజూ 46 ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. బెంగళూరు నుంచి ధర్మవరం డబ్లింగ్ పూర్తి అయితే మరిన్ని రైళ్లు జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉంది. అనంతపురం స్టేషన్ నుంచే రోజూ 6 వేల మంది ప్రయాణికులు ప్రయాణాలను సాగిస్తున్నారు. కరోనా తర్వాత బెంగళూరు-విజయవాడ ప్యాసింజర్ రైళ్ల పట్టాలెక్కలేదు. ఈ రైలు పునరుద్ధరిస్తే జిల్లాలోని చిన్న రైల్వే స్టేషన్‌ల నుంచి ప్రయాణాలు సాగించే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.



తుది మెరుగుల్లో స్టేషన్ నూతన భవనం

మెండుగా సౌకర్యాలు



అనంతపురం రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించడంతో సౌకర్యాలు పెరిగాయి. సువిశాల ప్లాట్‌ఫారాలు, విశాల వేచి ఉండు గదులు, ఆధునిక వసతులతో ఫుట్ ఓవర్ వంతెనలు ఏర్పాటు చేయడం సంతోషకరం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పనులు వేగవంతం చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

- చక్రపాణి, ప్రయాణికుడు

ప్రశాంత జీవనం గడపాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే: కక్షలు కార్పణ్యాలకు పోకుండా ప్రశాంతమైన జీవనం గడపాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తాడిపత్రి సబ్‌జైలును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైలులో పరివర్తన చెంది అందరూ ఎలాంటి గొడవలకు పోకుండా కుటుంబాన్ని చూసుకుంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు.

ఉద్యాన కోర్సు.. ఉపాధికి ఉషస్సు



ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల

మడకశిర, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఉద్యాన పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగ పడుతోంది. భవిష్యత్తులో ఉద్యోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించే దానికి అవకాశాలు ఉన్నాయి. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పట్టణ పరిధిలోని పెనుకొండ రోడ్డులో ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన వల్ల ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 2014 తెదేపా ప్రోత్సాహంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు రైతులకు సేవలు అందిస్తున్నారు.

231 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుల్లో 60 సీట్లు కేటాయించారు. పదో తరగతి పూర్తికాగానే ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఈ ఏడాది 42మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు పూర్తి కాగా 519మంది విద్యార్థులు కోర్సును పూర్తి చేశారు. ఇందులో 231మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు, 72మంది బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేశారు. మిగిలిన వారు ప్రైవేటు రంగంలో స్థిరపడ్డారు.

రైతులకు సేవలు అందించడంలోనే ఆనందం



కళాశాలలో విద్యార్థి స్థాయిలోనే రైతులకు పంటల సాగు, అధిక దిగుబడుల సాధించడానికి అనేక సలహాలు ఇచ్చాం. 2011-13లో మడకశిరలో కోర్సు పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగాలు చేశాను. ప్రస్తుతం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. తల్లిదండ్రులు హోటల్ నిర్వహిస్తూ చదివించి ఈ కోర్సు పూర్తి చేయించారు. సచివాలయంలో కూడా రైతులకు సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది.

- సబీహా, వీఏఓ, సోమందేపల్లి

గొర్రెల కాపరిగా ఉంటూ చదివించారు



మా నాన్న గొర్రెల కాపరిగా ఉంటూ నన్ను చదివించారు. గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామం నుంచి మడకశిర ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం ఊబిచెర్ల గ్రామ సచివాలయంలోనే గ్రామ ఉద్యాన సహాయ అధికారిగా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ఒమ్ము చేయకుండా చదువుకున్నాను.

- బాలాజీనాయక్, వీఏఓ, గుత్తి మండలం

టైలరింగ్ చేస్తూ..



మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో చదువుకున్నాను. మంచి విద్య అందించడంతో ఉత్తీర్ణులై కోర్సు పూర్తి చేశాను. తండ్రి అమీర్ బాషా టైలరింగ్ చేస్తూ నన్ను చదివించారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సచివాలయ పరీక్ష రాసి మొదట్లోనే ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

- షాజాద్, వీఏఓ, నల్లచెరువు

కొలువులకు దోహదం



10వ తరగతి పూర్తికాగానే రెండేళ్లలో ఉద్యోగం సాధించడానికి, మరింత ఉన్నత చదువులు చదువుకోవడానికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి. మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 75శాతం మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. విద్యార్థులకు ఉద్యాన పంటల పెంపకం, రైతులకు సలహాలు ఎలా ఇవ్వాలని దానిపై కళాశాల స్థాయిలోనే నేర్పిస్తాం. చదువుతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించారు.

- రమణ, ప్రిన్సిపల్

'కేతిరెడ్డి వల్లే శాంతిభద్రతలకు విఘాతం'



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గొడవలకు ప్రేరేపించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'కేతిరెడ్డి ఎన్నికల్లో ఓటమి పాలైనా ఇంకా అధికారంలో ఉన్నానన్న భ్రమలో ఉన్నారు. రౌడీలను వెంటబెట్టుకొని తిరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోలేదు. గత వైకాపా ప్రభుత్వంలో బదిలీపై వచ్చిన డీఎస్పీ శ్రీనివాసులు కేతిరెడ్డికి అనుకూలంగా పని చేస్తున్నారు. సబ్‌జైలు కూడలి వద్ద భాజపా వాహనాలకు కేతిరెడ్డి వాహనాన్ని అడ్డు పెట్టి గొడవకు కారణమయ్యారు. నేను ఘటనా స్థలానికి వెళ్లి ప్రజలు, కార్యకర్తలకు సర్దిచెప్పి పంపించాను. లేని పక్షంలో కేతిరెడ్డి ప్రజాగ్రహానికి గురయ్యేవాడని' అన్నారు. కేతిరెడ్డికి అనుకూలంగా పని చేస్తున్న డీఎస్పీతోపాటు గ్రామీణ ఎస్‌ఐ నరేంద్రపై సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

కసాపురం ఆలయ ఈఓగా వాణి బాధ్యతల స్వీకారం

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: కసాపురం ఆలయ ఈఓగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కాణిపాకం ఈఓగా ఆలయ విధుల నిర్వహణలో బదిలీపై వచ్చారు. నూతన ఈఓకు ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

భూ హక్కు చట్టం రద్దుతో ఆస్తుల భద్రతకు భరోసా

గోరంట్ల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం చేసిన భూ హక్కు చట్టం రాష్ట్రాన్ని వణికించిన నేపథ్యంలో తెదేపా అధికారంలోకి రాగానే ఎన్నికల హామీలో భాగంగా ల్యాండ్‌టైటిల్‌యాక్టు రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు సీఎం చంద్రబాబునాయుడు భరోసా కల్పించారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రి, ఎంపీ బీకే పార్థసారధి మంగళవారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బూదిలి పంచాయతీలోని పాపిరెడ్డిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం, సీమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంపద ఎలా సృష్టించాలి, సంక్షేమ పథకాలు ఎలా పేదల దరిచేర్చాలి, పరిశ్రమలు ఎలా తీసుకురావాలని అహర్నిశలు ముఖ్యమంత్రి కష్టపడుతున్నారని వారు పేర్కొన్నారు. వంద రోజుల్లో చేపట్టిన పథకాలను వివరించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ గోరంట్ల మండల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు తప్పక తీసుకొస్తామన్నారు. నాయకులు సోమశేఖర్, దేవానరసింహప్ప, సుధాకరరెడ్డి, అజ్మతుల్లా, రాజశేఖరరెడ్డి, నటరాజు, బహ్మాచారి, నాగభూపాల్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, రవి, శంకరరెడ్డి, గిరిధర్‌గౌడ్, రాజశేఖరప్ప కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బీకే, చిత్రంలో మంత్రి సవిత తదితరులు

అర్హులకు పింఛన్ అందిస్తాం: సునీత

రూ.10 లక్షల శుద్ధజల కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అనర్హులై ఉండి పింఛన్లు పొందుతున్న వారిని తొలగించి అర్హులకు అందిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని గొరిదిండ్ల, ముట్టాల, ఆత్మకూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైకాపా హయాంలో అర్హత లేకున్నా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పింఛన్లను పెద్ద ఎత్తున పొందారని వివరించారు. అలాంటి వారిని త్వరలోనే గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు లాంటి అనేక పనులు చేసిందన్నారు. గొరిదిండ్లలో గ్రీన్‌కో విండ్‌మిల్ సంస్థ సహకారంతో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ తెదేపా నాయకుడు సందీప్ చౌదరి ఆధ్వర్యంలో గ్రామస్థులకు తాగునీటి క్యాన్లను ఉచితంగా అందజేశారు. అనంతరం ముట్టాల, ఆత్మకూరు బీసీ కాలనీలో రూ.2.60 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాపంపల్లిలో శ్మశాన వాటికకు స్థలం చూపాలని ప్రజలు విన్నవించగా స్థలం చూపాలంటూ రెవెన్యూ సిబ్బందికి సూచించారు.



ఆత్మకూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, నాయకులు

రైతు మృతిపై సమగ్ర విచారణకు ఆదేశం



డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి విన్నవిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐకాసా సాకే హరి, తదితరులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: పామిడికి చెందిన వృద్ధ రైతు కుమ్మర సూర్యనారాయణ మృతి వ్యవహారంపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ప్రాథమిక విచారణ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోనే రైతు పురుగు మందు తాగాడు. గుర్తించిన పోలీసులు బాధితుడిని సర్వజన ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ వైద్య చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కలెక్టర్ జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిని తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ జేసీని విచారణ అధికారిగా నియమించారు. బుధవారం క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయనున్నారు. మరోవైపు..డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి ప్రాథమిక విచారణ చేశారు. గార్లదిన్నె తహసీల్దారు ఈరమ్మ, రీసర్వే డీటీ లక్ష్మీకాంతనాయక్, ఆర్ఐ లహరిక, బూదేడు వీఆర్‌ఓ మధులను తన కార్యాలయానికి పిలిపించుకుని రికార్డులను పరిశీలించారు. ఈ వ్యవహారాన్ని తూతూమంత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకోడానికి అధికారులు యత్నిస్తున్నారు. ఆ రైతుకు భూమే లేదంటూ కొత్తరాగాన్ని తెరపైకి తెస్తున్నారు. 'రీ సర్వే జరిగింది. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ పని చేయలేదు. భూహక్కు పత్రాలు రాగానే..మీకు పట్టా ఇస్తాం'.అని 2023 అక్టోబరు 27న అప్పటి తహసీల్దారు రైతు అర్జీకి జవాబు ఇచ్చారు. దీన్ని బట్టి ఆ రైతుకు భూమి ఉన్నట్లే కదా..అన్న వాదన వినిపిస్తోంది.

తనిఖీ చేశారా? లేదా?

రైతు సూర్యనారాయణ పురుగుమందు డబ్బా తీసుకుని సోమవారం కలెక్టరేట్ లోపలికి వచ్చారు. ఫిర్యాదుల విభాగం పక్కనే ఉన్న మున్సిపల్ టాయిలెట్ పక్కనే కూర్చొని ఆ మందు డబ్బా తీసి తాగినట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచే పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగే సోమవారం పోలీసులు ఎక్కువ వస్తారు. ప్రతి అర్జీదారున్ని తనిఖీ చేసి లోపలికి పంపాలి. బీడీ, సిగరెట్లు, అగ్గిపెట్టలు, లైటర్లు, మందు డబ్బాలు..ఇలా హానికర వాటిని లోపలికి అనుమతి ఇవ్వరు.

- పామిడి రైతు సూర్యనారాయణ మృతికి గార్లదిన్నె రెవెన్యూ అధికారులే కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సాకే హరి డిమాండ్ చేశారు. మంగళవారం డీఆర్‌ఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఆ తర్వాత డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి అక్కడికి రావడంతో వాదనకు దిగారు.

ప్రభుత్వ పనితీరుపై 'క్యూఆర్ కోడ్'

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే కాదు.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి స్పందన కోసం ప్రత్యేకంగా 'క్యూఆర్ కోడ్'ను తీసుకొచ్చిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల స్పందన ప్రక్రియ కోసం నిర్దేశిత నమోదు చేసే కార్యక్రమం ఈనెల 26లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, నియోజకవర్గ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ.. వంటి అధికారులతో వీక్షణ సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలపై విరివిగా అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. గ్రామ, వార్డుల్లో ఇంటింటా తిరగాలి. అభివృద్ధి స్టిక్కర్లు, కరపత్రాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లోనూ అతికించాలి. ప్రజల సలహా, సూచనలు తీసుకోవాలని తెలిపారు.

27 నుంచి అండర్-19 పాఠశాల క్రీడల జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అంతర్ జిల్లా క్రీడాపోటీల్లో పాల్గొనే అండర్-19 జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక పోటీలను ఈనెల 27 నుంచి ప్రారంభిస్తున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 27న వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రభుత్వ కొత్తూరు జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. బేస్ బాల్, సాఫ్ట్‌బాల్, చెస్, నెట్‌బాల్ పోటీలు 28న అదే మైదానంలో నిర్వహిస్తామన్నారు. బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు ఈ నెల 30న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల 1న అథ్లెటిక్స్, హాకీ, ఖోఖో పోటీలు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తారు. ఆసక్తి గల ఇంటర్ చదువుతున్న బాలబాలికలు జనన ధ్రువీకరణ, స్టడీ, పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌తో ఎంపిక పోటీలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: పీహెచ్‌సీ వైద్యులు నష్టం కలిగిస్తున్న జీవో నంబరు 85ను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేతలు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. గతంలో ఉన్న విధంగానే పీహెచ్‌సీ వైద్యులకు పీజీ సీట్ల కోటాలో 30 శాతం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అనంతపురంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పీజీ సీట్ల కోటా 15కు తగ్గించటంతో తీవ్రంగా నష్టపోతామని వివరించారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

గుత్తి, న్యూస్‌టుడే : నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు వెళ్తున్న కర్ణాటక వాసి సోమవారం రాత్రి రైల్లో నుంచి కింద పడి మరణించాడు. కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి మండలం కనేకల్‌కు చెందిన మల్లికార్జున(30) బెంగళూరులో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతను తన భార్యా పిల్లలతో బెంగళూరులో ఉంటున్నారు. తనతోపాటు ఉన్న చెల్లిని కనేకల్‌కు తీసుకొని వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బెంగళూరుకు వెళ్తుండగా రైల్లో వాకిలి వద్ద నిద్రమత్తులో కూర్చొని ఉండగా గుత్తి శివారులో తురకపల్లిరోడ్డులోని రైలు వంతెన వద్ద కింపడిపోయాడు. తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్‌పీ పోలీసులు మృతదేహానికి మంగళవారం పంచానామా నిర్వహించారు.

ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్ను

విపణి ధర రూ.6 కోట్ల పైమాటే



దేవరకొండ వద్ద విలువైన ప్రభుత్వ స్థలం ఇదే

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయసముద్రం పంచాయతీలో పవిత్రమైన దేవరకొండ క్షేత్రం దగ్గర ఉన్న రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేయడానికి కొంతమంది పెద్దలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బుక్కరాయసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో దేవరకొండ వద్ద 1.5 ఎకరాలను ఓ వ్యక్తికి పాసుపుస్తకంలో ఎక్కించారు. నిబంధనల ప్రకారం ఆ భూమిలో పంటలు మాత్రమే సాగు చేయాలి. ఈ భూమి అనంతపురానికి శివారులో ఉండటం, జగనన్న కాలనీ ఈ భూమి ఎదురుగా ఏర్పాటు కావడంతో మంచి డిమాండు ఏర్పడింది.

మూడెకరాలు ప్లాట్లుగా చేసి..

వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు వైకాపా నాయకులు భూమిని చేజిక్కించుకుని 1.5 ఎకరాలకు తోడు పక్కనే ఉన్న దేవరకొండ స్థలాన్ని 1.5 ఎకరాలు చదును చేసి కలిపేసుకున్నారు. మొత్తంగా 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించడానికి యత్నించగా బుక్కరాయసముద్రం ప్రజలు, కొండమీద వేంకటరమణ స్వామి భక్తులు అడ్డగించారు. అప్పట్లో 'ఈనాడు'లో కథనం రావడంతో కలెక్టర్ జోక్యం చేసుకుని భూమి అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నారు. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొంతమంది పెద్దలు ఈ స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పునాదులు తవ్వడానికి స్థలంలో రాళ్లను వదిలారు. ఇది మండల వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 6 కోట్లకు పైమాటే. ఇంతటి విలువైన స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రజల కోసం వినియోగించాలని, లేదా కొండమీదరాయుడి ఆలయం పేరుతో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దారు పుణ్యవతిని వివరణ కోరగా స్థల ఆక్రమణ గురించి ఇప్పటికే మా దృష్టికి వచ్చిందని, స్థలాన్ని పరిశీలించి బోర్డు ఏర్పాటు చేశామన్నారు. స్థలంలోకి ఎవరూ ప్రవేశించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

శస్త్రచికిత్స వికటించి.. గర్భిణి పరిస్థితి విషమం

ప్రభుత్వ వైద్యుడి సొంత క్లినిక్‌లో నిర్వహణ



చికిత్స పొందుతున్న రాధ



క్లినిక్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: కడుపు నొప్పితో సర్వజనాసుపత్రికి వచ్చిన తన భార్యకు అక్కడే వైద్యం అందించకుండా ఆ విభాగంలో పనిచేసే ఓ నర్సు దారి మళ్లించి ప్రభుత్వ వైద్యుడి సొంత క్లినిక్‌కు వెళ్లాలని సూచించారని.. తీరా అక్కడికి వెళ్లాక నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేశాడని కూడేరు మండలం హంసాపల్లికి చెందిన రామానాయుడు ఆరోపించారు. వైద్యుడు శస్త్రచికిత్స చేసిన అనంతరం యూరిన్ రాకపోవడంతో విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా మళ్లీ సర్వజనాసుపత్రికే తీసుకెళ్లమని చేతులెత్తేసినట్లు వివరించాడు. మళ్లీ సర్వజనాసుపత్రికి వెళ్లగా కర్నూలు తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారన్నారు. కర్నూలు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భసంచి శస్త్రచికిత్స చేసే సమయంలో పీసీఎన్‌ఎల్ కట్ చేశారని, తిరిగి అతికించకపోవటంతో సమస్య ఏర్పడిందని నిర్ధారించినట్లు వివరించారు. అప్పటికే భార్య వైద్యానికి రూ.1.50 లక్షలు ఖర్చు అయిందని భర్త వాపోయాడు. ఆమె కోలుకోవాలంటే మరో రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని మరో మూడు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని చెప్పడంతో మళ్లీ అనంతపురానికి వచ్చి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపాడు. దీనిపై డాక్టర్ రమణానాయక్‌ను కలిసి నిలదీయగా.. తనకు సంబంధం లేదని సమాధానమివ్వడంతో సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌వో, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌లను వేర్వేరుగా కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.

ఈ ఘటనపై సాయంత్రం బాధితురాలితో లావణ్య ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఈబీదేవి ని ఆదేశించారు. డీఎంహెచ్‌వో ప్రైవేటు వైద్యశాల వద్దకు చేరుకొని బాధితులతో మాట్లాడారు. బాధితురాలి వైద్యానికి అయ్యే వ్యయం సంబంధిత వైద్యుడు చెల్లిస్తారని తెలిపాడు. స్టాఫ్ నర్సు, వైద్యుడిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. లావణ్య ఆసుపత్రికి సంబంధించి క్లినిక్‌కు మాత్రమే అనుమతిచ్చామని, శస్త్రచికిత్సకు అనుమతి లేదని వెల్లడించారు. క్లినిక్‌కు నోటీసులు జారీ చేస్తామన్నారు.

భాజపా, జనసేన నాయకులపై కేసు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం సబ్‌జైలు కూడలి వద్ద తనపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, భాజపా నాయకులు డోలా రాజారెడ్డి, హరీశ్, ప్రవీణ్ దాడి చేశారని వైకాపా విద్యార్థి సంఘం నాయకుడు అమరనాథ్‌రెడ్డి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేశారు. తనపై భాజపా నాయకుడు హరీశ్, ప్రవీణ్‌తోపాటు మరో నలుగురు దాడి చేశారని ఒక టీవీ ఛానల్ రిపోర్టర్ రమేష్ ధర్మవరం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు

♦ 19 మంది బుకీల అరెస్టు ♦ రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణులు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్డీటీ మైదానంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని జిల్లా పోలీసులు ఛేదించారు. కర్ణాటక, హరియాణా రాష్ట్రాలకు చెందిన 19 మంది బుకీలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.60 లక్షల నగదు, 2 కార్లు, 19 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన శివానందగౌడ, లోహిత్, మధు, గురుప్రశాంత్, బీఎస్ విశ్వాస్, యోగేశ్, అరుణ్, వికాశ్, నవీన్‌కుమార్, రోహిత్, మోహన్‌కుమార్, అరుణ్‌కుమార్..హరియాణాకు చెందిన సోంబీర్‌సింగ్, సందీప్ కుమార్, తుషార్ వాద్వా, కౌశల్ ఖురానా, అంకిత్ జాంగ్రా, ధీరజ్ చుగ్, అనుభవ్ కుమార్‌లు నిందితులుగా తేల్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అనంతపురం గ్రామీణం డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్సై విజయ్‌కుమార్‌లతో కలిసి రాప్తాడులోని సబ్‌డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

హరియాణా నుంచి వచ్చి..

ఆర్డీటీ మైదానంలో జరిగిన భారత ఎ,బి,సి,డి గ్రూపు ఆటగాళ్లు తలపడుతున్న దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌లకు 12 మంది బెంగళూరు నుంచి, ఏడుగురు బుకీలు హరియాణా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతపురం చేరుకున్నారు. నిందితుల్లో శివానందగౌడ కీలకపాత్ర పోషించాడు. ఇతని మిత్రుడు అభి ద్వారా పోర్చుగల్‌కు చెందిన ప్రధాన బుకీ పాల్ పరిచయమయ్యాడు. పాల్ సూచనతో.. టెస్కాన్ అనే వ్యక్తికి ఆర్డీటీలో జరిగిన భారత్ ఎ, సి జట్ల మ్యాచ్‌ల లైవ్ కామెంటరీని ఇచ్చి బెట్టింగ్‌కు సహకరించాడు.

- సదరు మ్యాచ్‌లో వచ్చిన డబ్బును సోమవారం (23న) నిందితులు ఆర్డీటీ మైదానం ఎదురుగా ఉన్న పాలవీరనాగమ్మ ఆలయం సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో పంపకాలు చేసుకుంటుండగా సమాచారం అందుకున్న ఇటుకలపల్లి సీఐ సర్కిల్ సిబ్బంది, డీఎస్పీ క్రైం పార్టీ, ఎస్పీ ప్రత్యేక బృందం మెరుపు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, కార్లు, చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి జిల్లా కోర్టు ఎదుట ప్రవేశపెట్టగా, వారికి కోర్టు రిమాండ్ విధించింది.

రాయదుర్గం
• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

26న రాష్ట్ర వ్యాప్త వ్యాసరచన పోటీలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి విశిష్టతను తెలియజేస్తూ ఈనెల 26న ఉన్నత పాఠశాల విద్యార్థులకు (8,9,10) రాష్ట్రస్థాయి పోటీలను ఆయా ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు పొట్టిపాడు శ్రీసత్యసాయి సేవా భక్త మండలి సభ్యులు తెలిపారు. వ్యాసరచన పోటీలో భాగంగా భగవం తుడు ఒక్కడే నా నిజమైన స్నేహితుడు అనే అంశంపై వ్యాసాన్ని గ్రామాల్లో రాయాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఉప ప్రిన్సిపల్ మస్తాన్‌వల్లి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ, బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

వైకాపా నాయకుడిపై కేసు నమోదు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ శివ హెచ్చరించారు. తహసీల్దార్ షర్మిలను బెదిరించిన ఘటనలో మండలంలోని వైకాపా సీనియర్ నాయకుడు అంకంపల్లికి చెందిన గోపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 12న అంకంపల్లిలో విజిలెన్స్ అధికారులు చౌకదుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన చౌక దుకాణంలో సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడినట్లు దస్త్రాలను పరిశీలించిన అధికారులు సీజ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్‌తో వాదనకు దిగాడు. ఇదివరకే వివరాలు తెలియజేసినట్లు చెప్పినా, దురుసుగా ప్రవర్తించడంతో పాటు బెదిరించాడని వీఆర్వో ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంప్రదాయాలకు ప్రతీక తీజ్

వజ్రకరూరు, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక హర్యాళీ తీజ్ వేడుక అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని రూపానాయక్ తండాలో మంగళవారం హర్యాళీ తీజ్ వేడుకలలో పాల్గొన్నారు. బంజారా యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు సంస్కృతి, సంప్రదాయాలను అందించేందుకు కృషి చేస్తున్న గ్రామపెద్దలను అభినందించారు.

హనకనహాళ్‌లో నాకాబందీ

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని హనకనహాళ్‌లో రాముల వారి రథానికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించిన ఘటన నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో రాయదుర్గం సీఐ జయనాయక్, ఎస్ఐ నాగమధు సిబ్బందితో నాకాబందీ ఏర్పాటు చేశారు.

ఉచిత శిక్షణ.. భవితకు నిచ్చెన

● నిపుణులతో తరగతుల నిర్వహణ ● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేయూత


శిక్షణలో పాల్గొన్న ఉద్యోగార్థులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సరైన శిక్షణ, మార్గనిర్దేశం చాలా అవసరం. చాలాఏళ్ల తర్వాత డీఎస్సీ నిర్వహిస్తుండటంతో పోటీ అధికంగా ఉంది. పరీక్షలో రాణించాలంటే శిక్షణ ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తోడ్పాటు నందించారు. దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయికి దీటుగా లక్షలాది రూపాయలు వెచ్చించి 4 నెలల పాటు 150 మందికి పూర్తి స్థాయిలో ఉచిత డీఎస్సీ మెగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణాలకు చెందిన నిపుణులతో శిక్షణ, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

● టెక్స్‌టైల్ పార్కులో ఆగస్టు 25న మెగా డీఎస్సీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు అంగ్లం బోధించటానికి ఏలూరు నుంచి సురేష్‌కుమార్, గణితం గుడివాడ నుంచి శివకుమార్, తెలుగును బోధించటానికి హైదరాబాద్ నుంచి హరీశ్‌కుమార్, సైకాలజీ సబ్జెక్టును రామచంద్ర ఇక్బాల్ బోధిస్తున్నారు.

● ఈనెల 28న హైదరాబాద్‌కు చెందిన నిపుణుడిని రప్పిస్తున్నారు. శిక్షణ శ్రద్ధగా అభ్యర్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి వెనకబడిన వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

అర్థవంతంగా బోధన

నిపుణులు శిక్షణ అర్థవంతంగా ఇస్తున్నారు. పాఠ్యాంశాలతో పాటు ప్రపంచంలో చోటు చేసుకుంటున్న వివరాలపై వివరిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల బోధన తర్వాత అభ్యర్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆంగ్లం కాని విషయాలను మళ్లీ బోధిస్తున్నారు. - అరుణ, భూపసముద్రం




మధ్యాహ్న భోజనం సౌకర్యం



శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు దాతల సాయంతో మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. శిక్షణలో క్రమశిక్షణ, రన్నింగ్ నోట్స్, మెలకువలు నేర్పుతున్నారు. ఇతర ప్రాంతాల్లో శిక్షణ కంటే భిన్నంగా విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. - యల్లప్ప, కాదలూరు

ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా మారాలి



వెనకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో శిక్షణ తరగతులకు వెళ్లడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదల కోసం ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశాం. ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా ఎన్నిక కావాలన్నదే నా ఆశయం. పోటీ ప్రపంచంలో రాణించాలనే ఆసరాగా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. - కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే దారి రెండు చోట్ల కోతకు గురై ఇబ్బందిగా ఉంది. -సురేశ్, ఉరవకొండ

సమాధానం: మరమ్మతుల కోసం ప్రతిపాదించాం, త్వరలో పనులు జరిగే అవకాశం ఉంది. -మణిభూషణ్, పీఆర్ ఏఈఈ, ఉరవకొండ

- న్యూస్‌టుడే, ఉరవకొండ

క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని విద్యార్థులు, క్రీడాకారులు చేయూతను అందించడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కరణం చిక్కప్ప క్రీడా మైదానంలో హాకీ కళ్యాణదుర్గం క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, ఎమ్ నిర్వహిస్తున్న ఉచిత హాకీ క్రీడా శిబిరంలో క్రీడాకారులకు పరికరాలు పంపిణీ చేశారు. గ్రీన్‌కో కంపెనీ ప్రతినిధులు రూ.3.50 లక్షలు విలువ ఉన్న హాకీ క్రీడా పరికరాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో పిల్లలు రాణించాలని పేర్కొన్నారు. ఇక్కడి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలు బాలి వైనవని కొనియాడారు. క్రీడా మైదానంలో మరుగుదొడ్డు, ఈఏ ర్పాటు చేయాలని గ్రీన్‌కో కంపెనీ ప్రతినిధులను కోరగా, యాజమాన్యంతో మాట్లాడనున్నట్లు తెలిపారు. గ్రీన్‌కో కంపెనీ కేసీఆర్ జనరల్ మేనేజర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. కంపెనీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా క్రీడలను ప్రోత్సహించేందుకు హాకీ క్రీడా పరికరాలు అందజేశామన్నారు. గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు ప్రశాంత్‌రెడ్డి, శుభకుమార్, బాలాజీ, వేణుప్రసాద్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నిర్మల్ కుమార్, కార్యదర్శి అనిల్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

రథాల భద్రతపై ప్రత్యేక నిఘా

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఆలయాలకు సంబంధించిన రథాల భద్రతపై ప్రత్యేక నిఘాను కొనసాగిస్తామని సీఐ సురేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గవిమఠం, మల్లేశ్వర ఆలయం, పాత్య ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన రథాలను సందర్శించారు. ఆక్కడ ఉన్న భద్రత చర్యలను పరిశీలించారు. సంబంధిత ఆలయ అధికారులు రథాలు ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, కాపలా వ్యక్తులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'బోధనలో నిర్లక్ష్యం వద్దు'

ఉరవకొండ, న్యూస్‌టుడే: గురుకులంలో పాఠ్యాంశాల బోధనలో ఉపాధ్యాయులు ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వొద్దని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయకర్త మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని తనిఖీ చేశారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా బోధన సమర్థంగా సాగాలన్నారు. గురుకుల పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ పసిరాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: పట్టణంలోని కుమ్మరవీధిలోని గౌరసముద్రం మారెమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.


కళ్యాణదుర్గం (గ్రామీణం): గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు తదితరులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, నాయకులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. - న్యూస్‌టుడే, బృందం

బాధితురాలికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లికి చెందిన పద్మక్క భర్తతో కలిసి మూడు రోజుల కిందట వ్యవసాయ తోటలో పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడి పద్మక్క అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పందించారు. తన వంతుగా రూ.25వేలు నగదును నాయకులచే అందజేసి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు మల్లికార్జున, రంగారెడ్డి, బాబు, శర్మాస్, గంగిరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం నియోజకవర్గ మొట్టమొదటి ఎమ్మెల్యే టి.సి.మారెప్ప కుటుంబానికి ప్రస్తుత ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్యే కుమారుడు కుటుంబ పోషణ కోసం స్వగ్రామమైన తిమ్మాపురంలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. తన వంతుగా రూ.లక్ష అందజేసి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రహదారిని కప్పేసిన ముళ్లపొదలు



బెళుగుప్ప మండలం దుద్దేకుంట, గంగవరం గ్రామాలకు వెళ్లే దారి కిరువైపులా ఉన్న ముళ్లపొదలు ఏపుగా పెరిగి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా మారాయి. ఎదురుగా వాహనాలు వస్తే, దారి ఇవ్వడానికి కూడా అవకాశం లేని విధంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారి పక్కన ముళ్లపొదలను తొలగించకుండా ఆర్అండ్‌బీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ ఓబుళరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూస్తామని, వెంటనే తొలగింపునకు చర్యలు చేపట్టి మన్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ


ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

'మనోహర్‌దాస్‌పై చర్యలకు వినతి'

రాయదుర్గం పట్టణం: ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన రాధా మనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎస్ఐ వలిబాషాకు ముస్లింలు ఫిర్యాదు చేశారు. హిందూ ఉత్సవాల్లో భాగంగా ఆయన దర్గాలకు వెళ్లడం దురదృష్టకరం, నెల్లూరులో రొట్టెల పండుగపై తీవ్ర దూషణలు చేయడంపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ముర్తుజావలీ, భంభం బషీర్ అహ్మద్, రియాజ్, ఇబ్రహీం, ఇక్బాల్, శర్మాస్, ఎస్సాం పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యులు కావాలి


కళ్యాణదుర్గం: మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 54వ జాతీయ సేవా దినోత్సవం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకులు జగన్నాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వామ్యులను చేయడమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశమన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ శైలజారాణి, ఎన్ఎస్ఎస్ పీవోలు శ్రీధర్, రవిశంకర్, అధ్యాపకులు సూర్యనాగిరెడ్డి, జ్యోత్స్న, శ్యాంసుందర్, రాధాకృష్ణ, గురుమోహన్, సుధాకర్, లీముల్లా, మల్లప్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణం: ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల క్రమశిక్షణ నాంది పలికినట్లేనని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రఘురామమూర్తి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాగతం పలికారు. తొలుత ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. 'సేవా భావంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాయకులు నాగరాజు, హనుమంతరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు నారాయణ, నాగప్ప, కేడం దరాములు పాల్గొన్నారు.

లడ్డూల వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి

అనంతపురం (రాణినగర్), న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలకు సంబంధించిన వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలపై విచారణ పారదర్శకంగా చేయాలన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయదుర్గం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు నెలకు వంద యూనిట్ల వరకు విద్యుత్తు బిల్లులు మాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మంగళవారం చేనేత కార్మికులు క్షీరాభిషేకం చేశారు. జీరో విద్యుత్తు బిల్లులను చూపుతూ కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు.

తలుపులు తెరచుకునేదెన్నడు?



రైతు భరోసా కేంద్రాలను రూ.లక్షలు వెచ్చించి ప్రారంభించినా, లక్ష్యంగా వదిలేసిన ఘటన మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాల్లో కనిపిస్తోంది. కంబదూరులో సుమారు రూ.24 లక్షలతో భవనాన్ని నిర్మించి, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌తో ప్రారంభించారు. అప్పటి నుంచి నేటికీ తలుపులు తెరచుకోలేదు. ఏవో జాఫర్‌ను వివరణ కోరగా.. తమ అధీనంలో లేదని, పంట నమోదుపై సిబ్బంది వెళ్లారని ఏదో ఒక కారణం చెప్పి దాటుకుంటున్నారు. ఎరువులు, విత్తనాలు, సామగ్రి ఒక్కసారైనా ఆ భవనంలో ఉంచిన పాపాన పోలేదు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా భవనాన్ని వినియోగించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంబదూరు


బొమ్మనహాళ్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ, నాయకులు


ఉరవకొండ: కేకు కోస్తున్న తెదేపా నాయకులు

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు జరిగాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని మల్లాపురం, జుంజురాంపల్లి, డి.కొండాపురం, బొమ్మనహాళ్ మండలాల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, దీపావళికి ఉచిత సిలిండర్లు, అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం తదితర కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఉరవకొండ మండలంలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో తెదేపా నాయకులు, ఉద్యోగులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. - న్యూస్‌టుడే, బృందం

గుర్తు తెలియని వాహనం ఢీకొని కూలీ దుర్మరణం

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ కూలీ మృతిచెందగా, మరోకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. తాళ్లకెరె పంచాయతీ పరిధిలోని కృష్ణాపురానికి చెందిన పాలయ్య కుమారుడు నాగరాజు, తన చెల్లెలు నాగవేణికి కుక్క కరవడంతో చికిత్స కోసం కణేకల్ క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి మంగళవారం తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. 75 వీరాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నాగరాజు (32) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. చెల్లెలు నాగవేణి గాయాలతో బయటపడింది. వెంటనే ఆమెను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న నాగరాజు దుర్మరణం చెందడంపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య లక్ష్మి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ రమణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: భార్య, పిల్లలు దూరంగా ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై మండలంలోని మడెనహళ్లిలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బొగ్గుల లింగప్ప (32) మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడన్నారు. గమనించిన స్థానికులు కిందకు దించగా అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. లింగప్ప భార్య, పిల్లలతో కర్ణాటకలోని రాజాపూర్‌లో నివాసముంటున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

విద్యుత్తు తీగలు తగిలి బాలుడికి గాయాలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: ఇంటి మిద్దెపై విద్యుత్తు తీగలు తగలడంతో ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాంపల్లి చిన్నతండాలో మంగళవారం చోటు చేసుకుంది. బాలుడి తండ్రి నాగరాజు నాయక్ తెలిపిన వివరాల మేరకు.. బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా బంతి పైన పడటంతో తీసుకోవడానికి మిద్దెపైకి వెళ్లాడు. తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో బాలుడి చెయ్యి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విద్యుత్తు తీగలను మార్చడంలో విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తన కుమారుడి ఏదైనా జరిగితే వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వాపోయారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కణేకల్లు, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. మంగళవారం మండలంలోని బ్రహ్మసముద్రం వద్ద వేదవతి హగరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుంత తవ్వారు.. వదిలేశారు



పట్టణంలోని భంభం బాబా ఇందిరమ్మ కాలనీకు వెళ్లే దారిలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులు లీకేజీ కారణంగా రోడ్డుకు అడ్డంగా గుంతను తవ్వారు. ఈ ప్రాంతంలో తరచూ లీకేజీలు అవుతుండటంతో గుంత తీసి నెలల తరబడి అలాగే వదిలేస్తుండటంతో రాత్రిళ్లు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోకి ప్రవేశించే మార్గంలో వీధి దీపాలు కూడా సక్రమంగా వెలగక పోవడంతో గమనించకుండా వచ్చిన చోదకులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్టాలిన్‌ను వివరణ కోరగా వీలైనంత త్వరగా గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

తహసీల్దార్ కార్యాలయం మార్చాలని వినతి

బెళుగుప్ప: తహసీల్దార్ కార్యాలయం పాత భవనం కావడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మార్చాలని ఎంపీపీ పెద్దన్న, నాయకులు తిప్పయ్య, మల్లికార్జున్ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. పాత ఆరోగ్య కేంద్రంలోకి తహసీల్దార్ కార్యాలయం మార్చాలని, ప్రాథమిక పాఠశాలకు ఆట స్థలం కేటాయించాలని, రాయితీ పప్పుసెనగ విత్తనాల పంపిణీ, వేరుశనగకు రూ.20 లక్షలు, పాడికి వినతి చేసి, దూడలు - 2 ఏర్పాటు చేసినట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశానవాటిక స్థలం ఇవ్వండి

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మాపురంలో దళితులు శాశ్వతంగా శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకుల రమేష్, వెంకటేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బాలకిషన్ వినతిపత్రం అందజేశారు. వాగు, వంకల్లో పూడ్చుతున్నామని, స్థలం కేటాయించాలని కోరారు.

రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్‌గా పొరాళు పురుషోత్తం



రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాయదుర్గానికి చెందిన పొరాళు పురుషోత్తం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చేనేత, రాజకీయ కుటుంబానికి చెందిన వాడు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక రాజకీయాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పార్టీలో క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు.


● పేరు: పొరాళు పురుషోత్తం ● పుట్టిన తేదీ: 15-1-1967 ● విద్యార్హత: బీకాం, అనంతపురం ఆర్ట్స్ కళాశాల ● తండ్రి పేరు: పొరాళు శ్రీనివాసులు తెదేపా పట్టణాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, మాజీ వైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. 1983 నుంచి తెదేపాలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ● తల్లి పేరు: పొరాళు లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ ● చిన్నాన్న: పొరాళు లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ ● రాజకీయ ప్రవేశం: తెలుగుదేశం పార్టీలో 2009 - 2014 నుంచి 2019 వరకు 9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. ● 2021లో పురుషోత్తం, ఆయన భార్య పొరాళు గౌరీలు రెండు వార్డుల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ● జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ● వరించిన పదవి: 2024 సెప్టెంబరు 24న రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.

'రైతు సంఘం నిధుల స్వాహాపై ఫిర్యాదు'

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని అపిలేపల్లిలో రైతు సహకార సంఘంలో ప్రతినిధులకు తెలియకుండా నిధులు స్వాహా చేసిన వారిపై సంఘం ప్రతినిధులు యర్రిస్వామి, కొల్లప్ప, ఈరన్న మంగళవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత పదేళ్ల కిందట గ్రామంలో ఆంజనేయస్వామి రైతు సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నామన్నారు. మొత్తం 560 మంది సభ్యులుగా చేర్చుకుని, సహకార సంఘం కింద సభ్యత్వం రుసుముగా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1100 వసూలు చేసి నలుగురు సంఘం ప్రతినిధుల పేరిట బ్యాంకులో డిపాజిట్లు చేశామన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ తమ సంఘానికి రూ.5 లక్షలు నిధులు జమ చేయగా, ఏపీ ఎస్‌సీపీ సంస్థ నిధులు మంజూరు చేయడంతో మొత్తం రూ.40 లక్షలతో వ్యవసాయ పనిముట్లు పనులు చేపట్టామన్నారు. రైతు సంఘానికి ఆర్థిక ప్రతినిధిగా ఉన్న గంగాధర తమకు తెలియకుండా రూ.11 లక్షల నిధులు స్వాహా చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అనేకసార్లు నిధుల జమవివరాలు కోరినా, దౌర్జన్యం చేస్తూ వచ్చాడన్నారు. ఇప్పటికైనా విచారించి, సంఘం నిధులు జమయ్యేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

● పెరటి పంటల సాగులో నారీమణులు


ఇంటి ఆవరణలో నాటిన మొక్కలు

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆ ఇళ్లకు వెళితే పచ్చని మొక్కలు ఆహ్వానం పలుకుతాయి. పెరటి పంటలు సాగు చేస్తూ పర్యావరణ పరిరక్షణలో నారీమణులు భాగస్వామ్యమవుతున్నారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యంగా జీవనం సాగిస్తూ తోటి గృహిణులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

ప్రకృతి రక్షణకు తోడ్పాటు



నేను సుమారు 12 ఏళ్లగా మొక్కలు పెంపకంపై ఆసక్తి పెంచుకొన్నాను. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూనే, ఇంటి ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలతో పాటు సుమారుగా 15 రకాల పూల మొక్కలు నాటాను. పువ్వులు, ఇతర వాటిని బయట నుంచి కొనుగోలు చేయడం లేదు. ఇరుగు పొరుగు వారు కూడా బాగా తగ్గాయి. - కృష్ణవేణి, విద్యానగర్, కళ్యాణదుర్గం

సంతృప్తిగా ఉంది



మొక్కల సంరక్షణ చిన్నప్పటి నుంచే ఇష్టం. 18 ఏళ్లగా ఇంటి ఆవరణంలో మొక్కలను సంరక్షిస్తున్నాను. మామిడి, దానిమ్మ, కొబ్బరి, నిమ్మ, 8 రకాల పూల మొక్కలు, తమలపాకు తదితర మొక్కలు నాటాను. ఇంటి పని ముగించుకొని మొక్కల సంరక్షణకు కొన్ని గంటల సమయాన్ని కేటాయిస్తాను. బంధువులు, తెలిసిన వారికి పలు సలహాలు ఇస్తున్నాను. - నాగరాజుని, కోటవీధి, కళ్యాణదుర్గం

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

జె.సి.ప్రభాకరరెడ్డిపై ఈడీ కేసు వాయిదా

విశాఖ లీగల్: ఈడీ కేసులో తెదేపా నాయకుడు జె.సి.ప్రభాకరరెడ్డి సహా మరో 13 మంది మంగళవారం విశాఖ జిల్లా కోర్టు ప్రాగణంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయస్థానం కమ్ ఒకటో అదనపు జిల్లా న్యాయస్థానానికి హాజరయ్యారు. కేసు వివరాలిలా ఉన్నాయి... బీఎస్-4 ప్రమాణాలతో వాహనాలను తయారు చేయాలని సుప్రీంకోర్టు 2017లో ఉత్పత్తిదారులను ఆదేశించింది. నిందితులు ఒక సంస్థ ఉత్పత్తి చేసిన బీఎస్-3 వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, తప్పుడు పత్రాలను సృష్టించి బీఎస్-4 వాహనాలుగా వివిధ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించి, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని ఆరోపిస్తూ ఈడీ కేసు నమోదు చేసింది. మంగళవారం ఈ కేసు విచారణకు వచ్చింది. నిందితులు జె.సి.సహా మరో 13మంది కోర్టుకు హాజరై పూచీకత్తులను సమర్పించారు. తదుపరి విచారణ నిమిత్తం న్యాయమూర్తి కేసును నవంబరు 8వ తేదీకి వాయిదా వేశారు.

జైశ్రీరామ్ భక్తమండలి నిరసన

తాడిపత్రి, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు పేర్కొన్నారు. స్థానిక యల్లనూరు రోడ్డు కూడలిలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో భక్త మండలి సభ్యులు రాధాకృష్ణ, పోతుల గంగాధర్, రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన భక్తమండలి సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులో డీఎంఎం గేటు సమీపంలోని టీబీ రోడ్డులో ఫార్మసీ మెడికల్ స్టోర్ వద్ద చెట్టు కొమ్ముల మధ్యలో నుంచి నివాసగృహాలకు విద్యుత్తు సర్వీసు తీగలు లాగారు. అవి తెగిపడుతున్నాయి. **- సయ్యద్, స్థానికుడు.**

సమాధానం : సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తాం. **- రఘు, ఏఈ, ట్రాన్స్‌కో** – న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: పామిడిలోని షిర్డీసాయి నగర్‌లో మురుగు కాలువలు లేవు. **- వెంకటేశ్, కాలనీవాసి**

సమాధానం : ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైన వెంటనే రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తాం. **- ప్రభాకర్‌నాయక్, ఎంపీడీఓ** – న్యూస్‌టుడే, శింగనమల

సమస్య: లోలూరు గ్రామంలోని ప్రధాన రోడ్లకు వీధి దీపాలు వెలగడం లేదు. **- రాజకుళ్లాయి, లోలూరు**

సమాధానం : సమస్యను పరిష్కరిస్తాం. **- నిర్మలకుమారి, ఎమ్పీడీవో**

సమస్య: కేశవాపురంలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. **- స్థానికులు**

సమాధానం : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- వెంకటలక్ష్మమ్మ, ఈవోఆర్డీ** – న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

స్పందనకు వందనం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లు శ్మశాన వాటికలో మినీ నీటి ట్యాంక్‌కు ఐదు కుళాయిల ఉంటే రెండు కుళాయిలకు మాత్రమే బిరాడాలు ఉన్నాయని ఈనెల 23న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికకన వార్త 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనికి పురపాలక ఏఈ హరికృష్ణ స్పందించారు. మంగళవారం ఇంజినీరింగ్ సిబ్బంది వచ్చి కుళాయిలకు బిరాడాలు బిగించారు. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు.

చిన్నమట్లగొంది గ్రామం.. ప్రతిభ అపారం

➠ రైతు కుటుంబాల్లో అక్షర సేద్యం ➠ ప్రతి ఇంటా ఉద్యోగులు



గ్రామ ప్రధాన కూడలి

శింగనమల, న్యూస్‌టుడే: ఆ గ్రామానికి బస్సు వెళ్లదు. పొద్దు పుట్టగానే పొలాల్లో పని చేసుకొనే అన్నదాతలు. అయితేనేం గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు కొదవ లేదు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులతో మొదలుకొని దేశ సేవలో మేము సైతం అంటూ కొందరు.. రక్షకభటులుగా మరి కొందరు... వైద్య వృత్తిలో ఇంకొందరి సేవలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా చాలా మందే స్థిరపడ్డారు. గ్రామ ప్రత్యేకత గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

✦ చిన్నమట్లగొందిలో వ్యవసాయమే జీవనాధారంగా 250 కుటుంబాలు ఉన్నాయి. రెండేసి కుటుంబాలకు ఒకరు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొలువులు సాధించారు. 60 మంది ప్రభుత్వ, 80కి పైచిలుకు ప్రైవేట్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయం చేస్తూనే పిల్లలను ఉన్నతంగా చదివించి ప్రయోజకుల్ని చేస్తున్నారు. యువత సైతం తల్లిదండ్రుల కష్టం వృథా అవ్వకుండా పోటీ ప్రపంచంలో దూసుకెళ్లి కొలువుల్లో స్థిరపడుతున్నారు.

రోజూ ఐదు కి.మీ.లు నడిస్తేనే ..

చిన్నమట్లగొంది గ్రామం కొండల మధ్య చివరలో ఉంది. ఐదో తరగతి వరకు పాఠశాల ఉంది. ఆ తర్వాత ఐదు కి.మీ.లు కాలినడకన వెళ్లి ఆరో తరగతి చదువుకోవాలి. మిగిలిన పైచదువులకు జిల్లా కేంద్రానికి వెళ్లాలి. పిల్లలంతా ఇవన్నీ దాటుకొని ప్రతిభావంతులుగా జీవితాల్లో రాణిస్తున్నారు.

జీవితాల్లో స్థిరపడ్డాం

- జీవన్, మైనర్ ఇరిగేషన్, జేఈ



మానాన్న ఆంజనేయులు పొలం పనులు చేస్తూ చదువులు చెప్పించారు. ముగ్గురు కుమారులం చక్కగా చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నాం. నేను మైనర్ ఇరిగేషన్‌లో జేఈగా పని చేస్తున్నా. సోదరుడు చెన్నకేశవులు పశుసంవర్ధక శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మరో సోదరుడు బాలకృష్ణ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. మాపల్లెకు కొలువుల ఊరుగా పేరురావడం సంతోషంగా ఉంది.

విద్యను ప్రోత్సహించారు



నాన్న వెంకటరాముడు వ్యవసాయం చేసి ముగ్గురు కుమారులను డిగ్రీ వరకు చదివించారు. నేనే పెద్దవాడిని. పదిహేనేళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నా. సోదరుడు వెంకటేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో సోదరుడు రామమూర్తి పదేళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. అమ్మానాన్నలు మా చదువులను ప్రోత్సహించారు. **- వెంకటనారాయణ, ఆర్మీ**

ప్రతిభావంతులకు కొదవ లేదు



ప్రతిభ ఉంటే కొలువులు వెతుక్కుంటూ వస్తాయి. గ్రామంలోని యువతకు ప్రతిభ అపారం. మా నాన్న సంజన్న వ్యవసాయం చేసి ముగ్గురు కుమారులను చదివించారు. నేను ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించా. సోదరుడు ఆదిశేష ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజరుగా పని చేస్తున్నారు. మరో సోదరుడు నాగరాజు వ్యాపారంలో స్థిరపడ్డారు. **- రామాంజనేయులు, ఉపాధ్యాయులు, చిన్నమట్లగొంది**

సంక్షిప్త సమాచారం



కేసీ హరికుమార్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కేసీ హరికుమార్‌కు సత్కారం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కేసీహరికుమార్‌కు రాష్ట్రస్థాయి మార్క్‌ఫెడ్ కమిటీ డైరెక్టర్ పదవి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం గుంతకల్లు పట్టణంలో శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల అధ్యాపకులు కేసీహరికుమార్ నివాసానికి వెళ్లి ఆయనకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సీఎం సహాయ నిధికి రూ.2.22 లక్షలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల ఆదుకోవడానికి శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పట్టణంలో సేకరించిన విరాళాలు రూ.2.22 లక్షల వచ్చిందని అధ్యాపకులు పేర్కొన్నారు. సీఎం సహాయ నిధికి అందజేస్తామని మంగళవారం కరస్పాండెంట్ కేసీహరికుమార్, అధ్యాపకులు పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఇగుడూరు గ్రామంలో మంగళవారం రెండిళ్లలో చోరీ జరిగింది. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి, బాధితులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సూర్యనారాయణ, నారాయణస్వామి సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మకు మొక్కు తీర్చుకునేందుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తు తెలియని దుండగులు ఇంటిపైకప్పు నుంచి ప్రవేశించి నారాయణస్వామి ఇంట్లో రూ.2లక్షలు, 15 తులాల బంగారు ఆభరణాలు, సూర్యనారాయణ ఇంట్లో రూ.20వేలు నగదు, రెండు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

రూ.1.20 లక్షల నగదు..

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో చంఫీజ్‌ఖాన్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.1.20 లక్షల నగదు చోరీకి గురైందని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఏబీ మస్తాన్ తెలిపారు. పట్టణానికి చెందిన చంఫీజ్‌ఖాన్ కెనరా బ్యాంకులో నగదును డ్రా చేసుకొని ద్విచక్ర వాహనంలో పెట్టుకొని బయలు దేరి పాత బస్టాండు ఏరియాలో తన షాపు వద్ద వాహనాన్ని నిలబెట్టాడు. కొంతసేపటి తర్వాత ద్విచక్ర వాహనంలో ముందు భాగంలో ఉంచిన నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం

గుత్తి: గుత్తిలో సోమవారం రాత్రి ఓ వ్యక్తికి చెందిన రూ.70వేలు విలువజేసే ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. కోటలో నివాసం ఉంటున్న బేల్దారీ శంకర్ తన ఇంటి ముందు వాహనాన్ని ఉంచాడు. ఇంట్లో పడుకోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి వాహనానికి నిప్పుపెట్టారు. ఓయువకుడు వాహనాన్ని కాల్చి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

రజకుల దుస్తులకు నిప్పు

తాడిపత్రి: తాడిపత్రి పట్టణంలోని సుంకులమ్మపాళెంలో ఓ రజకుడి ఇంటిబయట ఉన్న దుస్తులను గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు రజకుడు శ్రీనివాసులు దుస్తులను శుభ్రం చేసి జీవనం సాగించేవాడు. సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రజకుని ఇంటిముందు ఉన్న దుస్తులకు నిప్పు పెట్టారు. దీంతో దుస్తులన్నీ కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి సీఐ శివగంగాధర్‌రెడ్డి పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ప్రమాదాన్నికొని తెచ్చుకోవద్దు



నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నా ప్రజల్లో మార్పు రావడంతో లేదు. ఇక్కడి చిత్రాన్ని చూడండి ఒక ద్విచక్ర వాహనంలో ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా నలుగురు వెళ్తున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా ప్రమాదం తప్పదు. ఇలాంటి ప్రయాణాలు తప్పని తల్లిదండ్రులు, పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

జలాశయ గేట్లకు లీకేజీ



చాగల్లు జలాశయం గేటు నుంచి లీకవుతున్న నీరు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రి నియోజవర్గంలోని పెద్దపప్పూరు మండలంలో చాగల్లు జలాశయం గేట్ల నుంచి నీరు లీకవుతోంది. గత వైకాపా ప్రభుత్వం జలాశయ నిర్వహణను ఐదేళ్ల పాటు గాలికి వదిలేయడంతో గేట్లు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. మరమ్మతులకు గురైన గేట్ల నుంచి నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి గేట్లకు మరమ్మతులు నిర్వహించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయాన్ని హెచ్చెల్సీ ఏఈ హరినాథ్‌తో ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలు, పథకాల గురించి క్షుణంగా వివరించారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు**



దంచెర్ల గ్రామంలో డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, పక్కన తెదేపా నాయకులు, రైతులు

ఫిర్యాదుపై అసిస్టెంట్ కలెక్టర్ విచారణ

గార్లదిన్నె, న్యూస్‌టుడే : ఎగువపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి భర్త వెంకటేష్ రెండో వివాహం చేసుకోడంతో తనకు భరణం ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితురాలు ఫిర్యాదు చస్త్రఅఆరు. దీనిపై మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఉప తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఎస్సై గురుమూర్తి, సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు.



సమస్య వింటున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కార్యాలయ దస్త్రాల పరిశీలన

నార్పల: స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధిహామి పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఎంపీడీవో దివాకర్, తహసీల్దారు అరుణకుమారి, ఏవీవో కిష్టయ్య పాల్గొన్నారు.

గుదిబండలా చెత్త తరలింపు

➡ ఇంటింటి సేకరణకు అడ్డంకులు ➡ వాహనాలకు ఇంధన సమస్య

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలికలోని చెత్త తరలింపు వాహనాలకు ఇంధనం సరఫరా నిలిచిపోయింది. అరువుపై ఇంధనం ఇస్తున్న పెట్రోలు బంకు నిర్వాహకులకు ఏడు నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. గత వైకాపా ప్రభుత్వం బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. ఫలితంగా చెత్త తరలింపు వాహనాలు నిలిచిపోయాయి.

కదలని వాహనాలు

రోజూ డంపింగ్‌యార్డులకు చెత్త తరలింపు నిలిచిపోతోంది. ఇంటింటి చెత్తసేకరణకు వచ్చే ఆటోలకు ఇంధనం లేక రావడం లేదు. పురపాలికలో మూడు ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు, రెండు భారీ వాహనాలు ఉన్నాయి. డంపింగ్ యార్డులు నేమితాబాదురోడ్డు, లచ్చానిపల్లిరోడ్డులో ఉన్నాయి. ఆటోలతో పలు వార్డుల్లో ఇంటింటి చెత్తసేకరణ చేయాల్సి ఉంది. పెద్దవాహనాలతో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. పెట్రోలు బంకు నిర్వాహకులు తమకు బిల్లులు చెల్లిస్తేనే ఇంధనం సరఫరా చేస్తామని భీష్మించారు. ఐదు రోజుల కిందట ఇంధనం లేక వాహనాలు మూలకు చేరాయి. పట్టణంలో చెత్తతో పాటు వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

పేరుకుపోతున్న వ్యర్థాలు

రోజూ గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెర్లోపల్లిలలో 30 టన్నుల చెత్త పోగు అవుతోంది. చెత్త తరలింపునకు ఇప్పటికే వాహనాల కొరత ఉంది. ఉన్న వాహనాలకు ఇంధనాన్ని సమకూర్చలేకపోతున్నారు. పురపాలిక అధ్యక్షురాలు వన్నూరుబీ భర్త హుసేన్‌పీరా మరో పెట్రోలు బంకు నిర్వాహకులతో మాట్లాడి అరువుపై డీజిల్‌ను ఇప్పించే ఏర్పాట్లు చేశారు. మరో బంకు నుంచి అధికారులు ఇంధనాన్ని అరకొరగానే తెచ్చుకుంటున్నారు. రోజూ దినదినగండంగా సాగుతోంది. ఈఏడాది సుమారు రూ.20లక్షల వరకు పెట్రోలు బంకు వారికి బకాయి పడ్డారు. చెత్త తరలింపు నకు తొమ్మిది వాహనాలుండగా వాటిలో కొన్నింటిని మాత్రమే అధికారులు తిప్పుతున్నారు.



గుత్తిలో చెత్త తరలింపు వాహనాలు

పురపాలకం : **గుత్తి**, జనాభా : **55 వేలు**
రోజూ పోగయ్యే చెత్త : **30 టన్నులు**
సమస్య : **అటకెక్కిన ఇంటింటి చెత్త సేకరణ**

బిల్లులు పెట్టాం

- నెట్టికల్లు ,శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుత్తి

ఇందనం బిల్లులు నిలిచిపోయాయి. పెట్రోలు బంకు వాళ్లు డీజిల్ ఇవ్వడం మానేశారు. రెండురోజులపాటు వాహనాలు వార్డుల్లో తిరగలేదు. ఛైర్‌పర్సన్ భర్త హుసేన్‌పీరా మరో బంకులో డీజిల్ వేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే రెండు బిల్లులు పెట్టాం. నిధులు మంజూరు అయితే సమస్య తీరుతుంది.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

రూ.3.70 లక్షల నగదు అగ్నికి ఆహుతి

నార్పల, న్యూస్‌టుడే : నాయనపల్లి గ్రామంలో సోమవారం ఓ ఇంట్లో జరిగిన విద్యుత్తు ప్రమాదంలో బీరువాలో దాచిన బంగారం, నగదు కాలిపోయాయి. నాయనపల్లిలో సాలన్న ఎప్పటిలాగే ఉదయాన్నే కుటుంబ సభ్యులతో కలిసి కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో విద్యుదాఘాతం సంభవించడంతో ఒక్కసారిగా టీవీ పేలిపోయింది. ఆ మంటలు పక్కనే ఉన్న బీరువాకు వ్యాపించాయి. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచుకున్న రూ.3.70 లక్షలు, తులం బంగారం కాలిపోయింది. స్థానికులు వచ్చి మంటలు ఆర్పేలోపు ఆర్థిక నష్టం జరిగిపోయింది. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

వంట ఏజెన్సీ నిర్వాహకుడి తీరుపై విచారణ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: పాతకొత్తచెరువు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థినిని వంట ఏజెన్సీ నిర్వాహకుడు కొట్టడంపై మండల విద్యాశాఖాధికారి 1,2 మస్తాన్‌రావు, సుబ్బరాయుడు స్పందిస్తూ పాఠశాలలో విచారణ జరిపారు. వంట ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణమూర్తిని విచారించారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని మండల విద్యాశాఖధికారి మస్తాన్‌రావు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

యల్లనూరు, న్యూస్‌టుడే : యల్లనూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారి రఘురాథ్ ఆధ్వర్యంలో మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఇంజినీర్లు మార్చిలోపల ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో వీరరాజు, ఈవోఆర్డీ విజయ్‌శేఖర్‌నాయుడు, ఏఈలు నరేంద్ర, సుప్రజ, పాల్గొన్నారు.

ఉపకారాగారం తనిఖీ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని మంగళవారం జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్, గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు వారు జైల్లో తనిఖీలు నిర్వహించి ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జైల్లో సౌకర్యాలు, వసతులను చూశారు. వంట గదిని పరిశీలించారు. తరువాత జైలులో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



గుత్తి : జైల్లో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు

కూటమి ప్రభుత్వం.. ప్రజల పక్షం

గుత్తి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని పురస్కరించుకుని గుత్తిలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటప్రకారం గుత్తిచెరువుకు హంద్రీనీవా నీరు వదిలినట్లు తెలిపారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, స్థానిక నాయకులు గుమ్మనూరు నారాయణ, ఎంకేచౌదరి, జనసేన నాయకులు మణికంఠ, పాటిల్‌సురేష్, భాజపా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



గుత్తి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

సంక్షేమానికి పెద్దపీట : శింగనమల : ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి కూటమి ప్రభుత్వాన్ని తీసుకొచ్చారు. మీరు ఆశించిన విధంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన ఆరంభించారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. లోలూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. తహసీల్దారు బ్రహ్మయ్య, ఎమ్పీడీవో నిర్మలకుమారి, తెదేపా మండల కన్వీనర్ గుత్త ఆదినారాయణ, పాల్గొన్నారు.

ఇసుక రవాణా అడ్డుకోవడం అన్యాయం

గుంతకల్లు: ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో తరలించే వారిని పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అన్నారు. సీపీఐ నాయకులతో పాటు ఇసుకను రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు స్థానిక డీఎస్పీ శ్రీనివాసులును కలుసుకుని సమస్యపై చర్చించి వినతిపత్రాన్ని అందజేశారు.

విజేతలకు బహుమతులు

గుంతకల్లు: రైల్వే డివిజన్ సాంస్కృతిక కార్యక్రమాల్లో గతంలో చాలా ముందు ఉండేది. ఈ విధానాన్ని ఉద్యోగులు తిరిగి కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాదు జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ అధికారి కిశోర్‌బాబు అన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో మొట్టమొదటి సారి జరిగిన సాంస్కృతిక పోటీల్లో విజయం సాధించిన వారికి ఆయన మంగళవారం రాత్రి రైల్వే అధికారుల రిక్రియేషన్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇళ్ల పట్టాల పంపిణీ

➡ రెవెన్యూలో దస్త్రాల నిర్వహణ గాలికి ➡ లబ్ధిదారులకు తప్పని పాట్లు



గుత్తి: వీరారెడ్డి కాలనీలోని ఈ స్థలానికి రెండు పట్టాలిచ్చారు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో రెవెన్యూ దస్త్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రధానంగా ఇళ్ల పట్టాల మంజూరు విషయంలో వాటికి సంబంధించి పక్కాగా దస్త్రాలు ఉండటం లేదు. ఫలితంగా పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 10 ఏళ్ల నుంచి దస్త్రాలు సరిగా నిర్వహించకుండా పట్టాలు జారీ చేస్తూ వస్తున్నారన్న విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఆయా స్థలాల్లో ఇంటి నిర్మాణాలు జరిగిపోయాయి. అధికారులేమో తమ దస్త్రాల్లో ఖాళీ స్థలాలుగా ఉన్నట్లు తీర్మానించుకుని ఇతరులకు ఇళ్ల పట్టాలిచ్చి చేతులు దులుపుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితి ఉంటోంది.

★ ఒకే స్థలానికి సంబంధించి రెండేసి పట్టాలు ఉండటం వల్ల లబ్ధిదారులు తికమకపడుతున్నారు. పేదలు ఇళ్లను నిర్మించుకునేందుకు పనులు చేపట్టే సమయంలో మరొకరు తమకూ పట్టా ఉందంటూ అడ్డుపడుతున్నారు. ఇందులో నిజమైన లబ్ధిదారులు ఎవరో తేల్చాలని బాధితులు అధికారులకు అర్జీలు ఇస్తున్నారు. అధికారులేమో తమ వద్ద ఉన్న దస్త్రాల్లో పట్టా జారీ కాలేదని ఇలా దస్త్రాల్లేకుండా పట్టాలు ఇస్తున్న అధికారుల తీరుపై పేదలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు

గుత్తిలో నివేస స్థలాలకు మంచి డిమాండు ఉంది. ఈక్రమంలో కాసులకు కక్కుర్తిపడుతూ అధికారులు ఒక స్థలానికి ఇద్దరి పేర్లతో రెండు పట్టాలు ఇస్తున్నారు. సర్వే నంబర్ 549లో కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని సుమారు వంద ప్లాట్లు వేసి ఇతరులకు విక్రయించారు. కొనుగోలు దారుల పేర్లతో పట్టాలు మంజూరు చేయించుకున్నారు. తరువాత అధికారులు ఆ సర్వే నంబరుతోనే మరికొందరితో సొమ్ము తీసుకుని పట్టాలిచ్చారు. ఇది తెలుసుకున్న రెండువర్గాల వారు అధికారులను నిలదీశారు. వారేమీ నోరు మెదపలేకపోయారు. ఇప్పటికీ పట్టాల వివాదం నడుస్తోంది. సర్వేనంబర్ 609కి సంబంధించిన స్థలంలోనూ దస్త్రాలు లేకుండా పట్టాలు జారీ అయ్యాయి. ఇక్కడా రెండేసి పట్టాలున్నాయి.

★ పట్టణానికి చెందిన మద్దిలేటికి ప్రభుత్వం రెండు ఏళ్ల కిందట ఇంటి పట్టా ఇవ్వగా ఆ స్థలం తమదని మరొకరు వచ్చారు. కొంత సొమ్ము చెల్లించి ఆ స్థలాన్ని కాపాడుకున్నాడు.

★ పాతహైవేలో రోడ్డు పక్కన రూ.లక్షలు విలువైన స్థలం వివాదంగా మారింది. మైనుద్దీన్ అనే వ్యక్తి భార్య పేరుతో రెవెన్యూ అధికారులు ఐదేళ్ల కిందట పట్టా ఇచ్చారు. మరో వ్యక్తి ఆ స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. తనకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, తనకు న్యాయం చేయాలని ఆ వ్యక్తి ప్రస్తుత అధికారులకు అర్జీ ఇచ్చుకోగా అధికారులు మీవద్ద ఉన్న పట్టా వివరాలు తమ రెవెన్యూ దస్త్రాల్లో లేవని తేల్చారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

-ఓబులేసు, తహసీల్దారు, గుత్తి

పట్టాల మంజూరు విషయంలో పూర్తి పారదర్శకత ఉంటుంది. తాము దస్త్రాలను పక్కాగా నిర్వహిస్తాం. గతంలో దస్త్రాలు లేకుండానే పట్టాలిచ్చిన విషయంలో తానేమీ చేయలేను. ప్రస్తుతం ప్రతి పనికి వివరాలు, దస్త్రాలు ఉండేలా చర్యలు తీసుకుంటాం. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

ఆలయ భూముల్లో స్థిర నివాసులకు పరిష్కారం చూపాలి

అనంత సాంస్కృతికం: నగరంలోని పలు ప్రాంతాల్లో దేవాదాయ భూముల్లో పేదలు వందేళ్ల నుంచి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారని వారికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే, తెదేపా జాతీయ ప్రధానకార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కోరారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుపై శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. బాధితులను దేవాదాయ కమిషనరు సత్యనారాయణ వద్దకు తీసుకెళ్లి సమీక్ష చేసినట్లు ప్రభాకర్‌చౌదరి తెలిపారు. పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం భూములోని సర్వే నంబరు 230లో అంబారపు వీధిలో 82 ప్లాట్లు, సర్వే నంబరు 2097-6 నిరుగంటి వీధిలో 44ప్లాట్లలో, సర్వేనంబరు 2081-9 నిరుగంటి వీధిలో 52ప్లాట్లలో తారకరామనగర్‌లో సర్వే నంబరు 152 ప్లాట్లలో 400కుటుంబాలు ఏళ్లుగా నివసిస్తున్నారని వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ ఆచార్య చెన్నారెడ్డి పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఏర్పాటు దినోత్సవం పురస్కరించుకొని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తగ్రూపు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. రక్తగ్రూపు తెలుసుకోవడం వల్ల రక్తదానం చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతి 3 నెలలకోసారి రక్తం దానం చేయవచ్చన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. మానవత కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ అనంత జిల్లా రక్తపాతానికి చిరునామాగా ఉండేది. నేడు రక్తదానానికి చిరునామాగా మారిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)
అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: హౌసింగ్ బోర్డు ట్యాంకు వద్ద డోరు నంబరు 12-5-202 సమీపంలోని నివాసాల పిచ్చి మొక్కలు పెరిగాయి. - **మురళీకృష్ణ**
సమాధానం: వెంటనే పిచ్చి మొక్కలను తొలగిస్తాం.
సమస్య: అరవిందనగర్‌లో కుక్కల బెడదతో ఇబ్బందిగా ఉంది - **రుక్మిణి**
సమాధానం: కుక్కలను త్వరలో తరలిస్తాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, అనంత నగరపాలక



పాతూరు తాడిపత్రి బస్టాపు వద్ద రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలపకుండా ఖాళీ చేయించారిలా..

పాతూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని పాతూరులో నెలకొన్న ట్రాఫిక్ రద్దీపై మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'అడ్డదిడ్డంగా వాహనాలు.. వీడని ట్రాఫిక్ చిక్కులు' అనే వార్తకు పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్, ఏఎస్సై రామంజనరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, సిబ్బంది ఆధ్వర్యంలో వాహనరద్దీపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాడిపత్రి బస్టాపు వద్ద చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద, గాంధీనగర్ రోడ్డులోని పాఠశాల ఎదుట ఇష్టారాజ్యంగా నిలుపుతున్న ఆటోలు, ఇతర వాహనాలపై రోడ్డుపై ఆపకుండా ఖాళీ చేయించారు. మార్కెట్ ఎదుట ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లను అక్కడి నుంచి తొలగించారు. ట్రాఫిక్ అడ్డంకిగా మారిన రోడ్డుపై వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈనాడు కథనానికి స్పందన

రూ.124 కోట్లతో

వైకాపా పాలనలో వరద ముంపుపై నిర్లక్ష్యం

రక్షణ గోడలకు ప్రతిపాదనలు



రజకనగర్‌లో రక్షణ గోడ లేకుండా..

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నగరంలోని వేలాది మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికల్లోనూ, ఆ తర్వాత ఇచ్చిన ప్రధాన హామీల్లో నడిమివంక, మరువవంకకు అనుసంధానంగా రక్షణగోడ నిర్మాణంతోపాటూ పూడికతీత పనులు చేపడతామని ప్రజలకు స్పష్టం చేశారు. నగరంలో వరదల వల్ల 2022 అక్టోబరులో నడిమి వంక పరివాహ ప్రాంతాల్లో పలు నివాసాలు నీట మునిగాయి. అప్పట్లో శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపడతామని పూర్తి స్థాయి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయగా నిధులు మంజూరు రెండేళ్లు దాటినా చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి.

వరద ప్రభావం: నడిమి వంక, మరువ వంక
ఇబ్బంది పడే కాలనీలు 25
మరువ వంక: బోయవీధి, సూర్య నగర్, ఉమానగర్, నీరు గంటి వీధి, ఖాజానగర్, చేపల గుంత, వేణుగోపాల్‌నగర్
వంకను ఆక్రమించి కట్టుకున్న నివాసాలు: 437



సోమనాథ్‌నగర్ వద్ద నడిమి వంక

- ఇటీవల అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఎమ్మెల్యే ప్రసాద్ సమస్యను తీసుకెళ్లారు. కచ్చితంగా సమస్య పరిష్కారం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. జలవనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది.

చేపట్టే పనులు ఇలా..

- నడిమి వంక, మరువ వంక విస్తరించిన మూడు కిలోమీటర్ల మేర పూడిక తీత చేపట్టి, రక్షణ గోడ నిర్మించాలి.
- అంతర్గాంలో సిమెంట్ కాంక్రీటుతో నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించారు.
- ఆయా ప్రాంతాల్లో బ్రిడ్జిలు, వంతెనలు నిర్మాణం
- రుద్రంపేట నుంచి కొంతభాగం రాప్తాడు నియోజకవర్గం అనంతరం నడిమి వంక ప్రారంభం అయి రజకనగర్‌లో ముగుస్తుంది. ఆయా ప్రాంతాల్లో రక్షణ గోడ పూర్తి చేయాల్సి ఉంది.

అనంతపురం అర్బన్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : అనంతపురం అర్బన్ సబ్‌డివిజన్ డీఎస్పీగా వళ్లూరి శ్రీనివాసరావు మంగళవారం నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు ఏసీబీ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ప్రకాశం జిల్లా కందుకూరు, చీరాల, కృష్ణా జిల్లా నూజివీడు, విజయవాడ ఈస్ట్ డీఎస్పీగా పనిచేశారు. నగరంలో శాంతిభద్రతలు, మహిళల రక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, జూదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నూతన డీఎస్పీ తెలిపారు.

ఏబీవీపీ విద్యార్థుల సమ్మేళనం

ఎస్కేయూ: ఏబీవీపీ విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఆ విద్యార్థి సంఘం కన్వీనర్ కిరణ్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. కిరణ్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అక్టోబరు 27, 28 తేదీల్లో సమ్మేళనం నిర్వహిస్తామన్నారు.

ముగిసిన పాఠశాల క్రీడల చదరంగం పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడల చెస్ పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి సుగుణబాయి, డీఎస్‌డీఓ షఫీ, సమన్వయకర్త ప్రసాద్, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రవీంద్రబాబు, పీడీలు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్, మధుప్రసాద్ ప్రారంభించారు. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలు ఎంతో ఆసక్తిగా జరిగాయి.

ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా....

అండర్-14 బాలుర విభాగంలో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్, సహృద్, జె.నితీష్‌ప్రసాద్, ఎన్.దర్శన్, షెక్షా. బాలికల విభాగంలో వై.లాలిత్య, యు.త్రిపాద, ఎ.అంబిక, ఓ.అభినేత్రి, ఎం.మేఘనలు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఎస్.యేహాన్, టి.ప్రణవ, భగీరథ, పార్థసారథి, ఎ.వంశీలు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.శ్రీహ, మహేశ్వరి, క్లారా, శ్రీవిజ్ఞ, ఆసనలు ఎంపికయ్యారు.



పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సాంకేతిక సదస్సులో చైర్మన్ పల్లె కృష్ణకిషోర్ రెడ్డి, జేఎన్టీయూ ఆచార్య ప్రశాంతి

కమ్యూనికేషన్స్, సెన్సార్‌లో విప్లవాత్మక మార్పులు

రుద్రంపేట, న్యూస్‌టుడే: పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్టీయూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య ప్రశాంతి అధ్యక్షతన పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. సదస్సులో కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ రెడ్డి పాల్గొన్నారు. ఆచార్య ప్రశాంతి మాట్లాడుతూ.. వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, సెన్సార్ టెక్నాలజీపై భవిష్యత్తులో విప్లవాత్మక ప్రభావాన్ని చూపుతాయని నొక్కిచెప్పారు. నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధి చెందుతున్న రంగాల్లో తాజా పరిణామాలు అన్వేషించడానికి ఎఫ్‌డీపీ సదస్సులు ఫ్యాకల్టీలకు అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందని ప్రస్తావించారు. కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ మాట్లాడుతూ.. ప్రిన్సిపల్ రమేష్‌బాబు, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తి జోర్దానా, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



చీపుర్లు పట్టి ఊడ్చేశారు!

ప్రభుత్వ వైద్యకళాశాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావుతో పాటు వైద్యులు, వైద్యవిద్యార్థులు చీపుర్లు చేతపట్టుకుని కళాశాల ఆవరణలో ఉన్న చెత్త చెదారాన్ని ఊడ్చేశారు. అనంతరం కళాశాల ఆవరనలో మొక్కలను నాటారు. ప్రహరీలకు గతంలో వేసిన గోడపత్రాలను తొలగించారు. మన కళాశాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకుందాం అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ షారోన్ సోనియా, వైద్యులు శివశంకర్‌నాయక్, వైద్యనాథ్, వరదరాజులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆదిరెడ్డి పరదేశినాయుడు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం)**

బురద దారిలో అడుగు వేసేదెలా?

బురదతో నిండిన ఈ దారి మూరుమూల పల్లెకు వెళ్లేదనుకుంటే పొరబడినట్లే. అనంత రెండో డివిజన్‌లోని బిందెల కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు ఇది. అడుగు తీసి వేయాలంటే కష్టమే. ఇటీవల కేబుల్ తీగల కోసం రోడ్డును తవ్వి మట్టితో పూడ్చారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బురదతో నిండిపోయింది. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాహనదారులు ఎక్కడ జారి పడతామోనని భయపడ్డారు. పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు.
- న్యూస్‌టుడే, రాణినగర్



ప్రైవేటు ఉద్యోగి మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒంటరితనంతో బాధపడుతూ నగరంలో సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించిన ప్రైవేటు ఉద్యోగి చికిత్స పొందుతూ మంగవారం మృతి చెందాడు. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన గంగప్ప చిన్నకుమారుడు కొల్లయ్య (26) పెనుకొండలోని కియా పరిశ్రమలో పనిచేస్తూ, నగరంలోని జనశక్తి నగర్‌లో మిత్రులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొంతకాలం కిందట తల్లిదండ్రులు మరణించారు. సోదరీమణులు, సోదరుడికి వివాహమై ఎవరికి వారు వేరుగా ఉంటున్నారు. తనకు ఎవరూ లేరని, మిగతా కుటుంబ సభ్యులు దూరంగా ఉంటున్నారని మదనపడేవాడు. ఒంటరితనంతో బాధపడేవాడు. సోమవారం మధ్యాహ్నం అద్దె ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. జనశక్తినగర్‌కు సమీపంలోని పెట్రోల్‌బంకు వెనుకభాగంలో పురుగు మందు తాగాడు. అనంతర తన మిత్రుడు వేణుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. కంగారుపడిన మిత్రుడు ఘటనాస్థలికి వెళ్లాడు. అక్కడ అపస్మారకస్థితిలో ఉన్న కొల్లయ్యను మరో మిత్రుడు రుద్ర సాయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు.

ప్లాస్టిక్ నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ

ఎస్కేయూ: ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనతో పర్యావరణం పరిరక్షించుకోవచ్చని ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ ఆచార్య మురళీధర్ పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా ఎస్కేయూలోని ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఎస్కేయూ, కందుకూరు, ఆకుతోటపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల ప్రాంగణంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు శుభ్రం చేశారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సోమశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఇంటి స్థలం వివాదంపై ఘర్షణ

అనంత నేరవార్తలు: ఇంటి స్థలం వివాదం కారణంగా ఇరువర్గాల మధ్య రుద్రంపేటలో ఘర్షణ చోటు చేసుకుంది. కాలనీకి చెందిన సూర్యనారాయణరెడ్డి, భార్యలు సుభద్రమ్మ, సరస్వతమ్మలతో కలిసి కాపురం ఉంటున్నాడు. కాగా వీరు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి స్థలం విషయంలో వివాదం ఉంది. నగరానికి చెందిన శాంతమ్మ కుటుంబసభ్యులు ఇంటి స్థలం తమది అంటూ పలుమార్లు ఇంటివద్దకు వెళ్లి గొడవపడేవారు. ఈ క్రమంలో మంగళవారం కూడా శాంతమ్మ, కుమారుడు మహబూబ్ బాషా, కోడలు, వీరబ్రహ్మం గొడవపెట్టుకున్నారు. ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని బెదిరించారు. ప్రశ్నించిన సరస్వతమ్మపై దాడికి పాల్పడ్డారు.

మాది చేతల ప్రభుత్వం: దగ్గుపాటి ప్రసాద్

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మాటలు చెప్పబోదని చేతలతో అభివృద్ధి చేసి ఏమిటో నిరూపిస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని లక్ష్మీనగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. పింఛన్లను పెంచడంతో పాటు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. జగన్ ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నా ఒక్క టీచరు పోస్టు కూడా భర్తీ చేయలేదని చంద్రబాబు అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా డీఎస్సీ పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేశారన్నారు. నగర కమిషనరు నాగరాజు, అర్బన్ తహసీల్దార్ హరికుమార్, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు ఆదెన్న, బుగ్గయ్య చౌదరి, భాజపా జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమిషనరు నాగరాజు, తెదేపా నాయకులు

యువత సేవా మార్గం వైపు పయనించాలి

రాణినగర్: యువత సేవా రంగం వైపు పయనించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఐదో రోడ్డులో హేమంతు, జయప్రకాశ్, నారాయణ, శ్రీనివాస్ గౌడ్, చలపతి, చరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అక్షర్ కంటి వైద్యం ఆసుపత్రి ఆధ్వర్యంలో పలు పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మంది పేదలు ఉండే ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి

అనంతపురం (రాణినగర్), న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలకు సంబంధించిన వ్యవహారంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలపై విచారణ పారదర్శకంగా చేయాలన్నారు.

పంట సాగులో లోపాల గుర్తింపు

రాప్తాడు, న్యూస్‌టుడే : వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని ఎన్డీయే ప్రభుత్వం పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మంగళవారం వ్యవసాయ అధికారులు రాప్తాడు మండలం మరూరు గ్రామంలో రైతుల పొలంలోకి వెళ్లి పంట పరిశీలనతోపాటు లోపాలను గుర్తించారు. దిగుబడి తగ్గడానికి గల కారణాలను రైతులకు తెలియజేశారు.

జనసేన అధినేతకు మద్దతుగా ప్రత్యేక పూజలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేయడాన్ని నిరసిస్తూ ఉప సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం జనసేన రాయలసీమ మహిళా కమిటీ ఆధ్వర్యంలో తపోవనంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా కమిటీ సమన్వయకర్త పెండ్యాల శ్రీలత ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధిచేసి స్వామివారికి 108 టెంకాయల కొట్టారు.

సంపూర్ణాంధ్రప్రదేశ్ సాధించాలి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉత్తమ అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు. తద్వారా సంపూర్ణ ఆంధ్రప్రదేశ్‌ను సాధించవచ్చని రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా ప్రాజెక్టు మేనేజరు భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన హెచ్‌ఐవీ నిర్మూళనపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన ప్రసంగిస్తూ విద్యార్థిదశ నుంచి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రిన్సిపల్ రామమూర్తి, సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ అటెండర్ అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న శివకుమార్ అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 19న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు కలెక్టరేట్, బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం రెండో పట్టణ పీఎస్‌లో బాధితుని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



పంపనూరులో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నిత్య చైతన్యం..

పలు కార్యక్రమాలతో స్ఫూర్తి నింపుతోన్న అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు

గ్రామ సమస్యలకు పరిష్కారం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆమె బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి ప్రభుత్వం నుంచి వచ్చే పాలు, గుడ్లు, బాలామృతం వంటి వాటిని సక్రమంగా అందేలా చూడటం.. అంతటితో ఆమె ఆగిపోలేదు. సమాజ చైతన్యానికి నడంకట్టి.. పలు సమస్యలకు మూలాలు కొనుక్కొని అందుకు తగ్గట్టుగా పలు కార్యక్రమాలు చేపట్టి ముందుకెళ్తోంది ఆత్మకూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణికి తన సెక్టర్‌లో 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ ప్రభుత్వ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తోంది.

గిరిజన మహిళలకు చదువు

అంగన్‌వాడీ బాధ్యతలతోపాటు గిరిజన ప్రాంత మహిళల్లో అక్షరాస్యత లేదని గుర్తించి వారందరికీ చదువు చెప్పాలని నిర్ణయించింది. నిత్యం రెండు గ్రామాలను సందర్శించి గిరిజన మహిళలకు పాఠాలను బోధిస్తోంది. మిగతా అంగన్‌వాడీ కార్యకర్తలను ఒప్పించి తాము లేని సమయంలో కూడా బడులు కొనసాగేలా కృషి చేస్తోంది. చదువు లేకనే బాల్యవివాహాలు కొనసాగుతున్నాయని గ్రహించి ఈ కార్యక్రమానికి పూనుకొంది. ఇప్పటికి ఆమె క్లస్టర్‌లో 70 శాతనికి బాల్య వివాహాలు తగ్గిపోవడం గమనార్హం.

అభ్యర్థన.. అభివృద్ధి

మండలంలో దెబ్బతిన్న అంగన్‌వాడీ కేంద్రాలను తిరిగి కొత్తగా నిర్మించేందుకు కియా, విండ్‌మిల్స్, ఆర్డీటీ లాంటి ప్రైవేటు సంస్థలకు విన్నపాలను అందించారు. ఆర్డీటీ స్పందించి పంపనూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని కొత్తగా నిర్మించేందుకు ముందుకు వచ్చింది. గతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పాతబడి ఎప్పుడు కూలుతుందో అనేలా ఉండేది. రూ.12 లక్షలు వెచ్చించి నూతన భవన నిర్మాణం చేపట్టారు.

- ఆత్మకూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 పాతబడి వర్షం వచ్చినప్పుడు నీరు కారుతూ ఉండేది. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి రూ.40వేలు సేకరించి భవనానికి మరమ్మతులు చేయించారు.
- 19 కేంద్రాలకు తాగునీటి సమస్య ఉండగా ఎంపీడీవో, పంచాయతీ అధికారులకు సమస్యను తెలియజేసింది. వారు స్పందించి ప్రతి కేంద్రానికి తాగునీటి వసతిని కల్పించారు.
- 2024 విద్యా సంవత్సరంలో మండలంలోని 11 గ్రామాల్లో బడిమానిన 36 మంది విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.
- పి.సిద్దరాంపురం గ్రామంలో ప్రత్యేక కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా 20 మంది మహిళలు ముందుకు వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు.



సింగంపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో నిరక్షరాశ్యులకు అక్షరాభ్యాసం చేస్తున్న లావణ్య

వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో పెట్టుబడి, రైతులకు శ్రమ తగ్గించేందుకు వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని ముట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కంది పంటను అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత పరిశీలించారు. ప్రజలకు వ్యవసాయంలో మెలకువలు తెలియజేసేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. వ్యవసాయాధికారులు రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి పంటను పరిశీలించి సూచనలందిస్తారని చెప్పారు. డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేసే విధానాన్ని ప్రతి రైతు తెలుసుకోవాలని కోరారు.



ముట్టాలలో డ్రోన్ ద్వారా మందు పిచికారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత